


సూపర్ సిక్స్‌కు అదనంగా
మరిన్ని మేళ్లు!

టీడీపీ,జనసేన,బీజేపీ కూటమి మేనిఫెస్టోకు అనూహ్య స్పందన

పోలింగుపై అమిత ప్రభావం చూపే అవకాశం



సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతోనే జిల్లాలోని వివిధ వర్గాలకు రూ. 4 వేల కోట్లకు పైగా లబ్ధి కలగనుండగా.... తాజాగా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విడుదల చేసిన ఉమ్మడి మేనిఫెస్టోతో అదనంగా మరిన్ని మేళ్ళు జరగనున్నాయి. ప్రత్యేకించి పలు వర్గాలకు విశేషమైన లబ్ధి చేకూరనుంది. దీంతో ఈ మేనిఫెస్టో పట్ల జిల్లావ్యాప్తంగా అన్ని వర్గాల్లోనూ విశేష స్పందన కనిపిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో అమితంగా ప్రభావం చూపనున్న ఈ మేనిఫెస్టోలో వివిధ వర్గాలకు మంచి చేసే పథకాలు, కార్యక్రమాల హామీలుండగా మచ్చుకు కొన్నింటిని ఎంచుకుని జిల్లా ప్రజలకు కలిగే మేలును వివరించే ప్రయత్నమిది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అభివృద్ధి, సంక్షేమాల్లో అగ్ర తాంబూలం మహిళలకే!

ఎన్డీయే కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలో లబ్ధి పొందే వర్గాల్లో మహిళలదే అగ్రస్థానం. జిల్లాలో సుమారుగా 11 లక్షల మంది మహిళలున్నారు.ఇందులో 19ఏళ్ళ నుంచీ 59ఏళ్ళ లోపు వయసున్న వారి సంఖ్య ఇంచుమించు 7.70 లక్షలుంటుందని అంచనా.వీరికి నెలనెలా రూ. 1500 చొప్పున నెలకు రూ.115.50 కోట్లు, ఏడాదికి రూ. 1386 కోట్లు చొప్పున ఐదేళ్ళకు రూ. 6930 కోట్లు లబ్ధి కలగనుంది. వ్యక్తిగతంగా ఒక్కొక్కరికీ ఏడాదికి రూ. 18 వేలు, ఐదేళ్ళకు రూ. 90 వేల వంతున అందనుంది. అమ్మఒడి తరహాలోనే అయితే కుటుంబానికి ఒక విద్యార్థికి కాకుండా స్కూలు పిల్లలు ఎందరుంటే అందరికీ ఏడాదికి రూ. 15 వేల వంతున అందనుంది. జిల్లాలో సుమారు 8 లక్షల మందికి పైగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కలగనుంది. మహిళలకు నైపుణ్యాల శిక్షణతో పాటు చిన్న మధ్య తరహా పరిశ్రమలు,అంకుర సంస్థలు పెట్టాలనుకునే ఔత్సాహికులకు ప్రాజెక్టు వ్యయంలో గరిష్ఠంగా రూ. 10 లక్షలు సబ్సిడీ అందనుంది.



వడ్డీలేని రుణాల పరిమితి పెంపుతో 4.73 లక్షలమంది మహిళలకు అదనపు లబ్ధి

గ్రామీణ ప్రాంతాల్లో 34,131 స్వయం సహాయక మహిళా సంఘాలు, పట్టణ ప్రాంతాల్లో 11,728 సంఘాలు వుండగా వాటికి ఇపుడున్న వడ్డీ లేని రుణ పరిమితి రూ. 3 లక్షల నుంచీ ఏకంగా రూ. 10 లక్షలకు పెరగనుంది. దానివల్ల గ్రామీణ సంఘాల్లోని 3.54 లక్షలమంది మహిళలకు, పట్టణ సంఘాల్లోని 1.18 లక్షలమంది చొప్పున మొత్తం 45,859 సంఘాల్లోని 4.73 లక్షలమంది సభ్యులకు అదనపు మేలు జరగనుంది.

అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు ఊరట

అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ చెల్లింపులు జరుపుతామని, ఆశా వర్కర్లకు గౌరవ వేతనం పెంచుతామని మేనిఫెస్టోలో ఎన్డీయే కూటమి ప్రకటించింది. దీనివల్ల జిల్లాలోని 2425మంది అంగన్‌వాడీ వర్కర్లకు, 2041 మంది హెల్పర్లకు ఊరట కలగనుంది. అదేవిధంగా జిల్లాలోని 1705 మంది ఆశా వర్కర్లకు కూడా వేతనాలు పెరిగేందుకు అవకాశముంది. ఉద్యోగాలు చేసుకునే మహిళలకు ప్రత్యేకంగా వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ళు ఏర్పాటు చేయనుంది.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు విశేష లబ్ధి

జనాభాలో అధికంగా వున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, క్రిస్టియన్లకు ఎన్డీయే కూటమి కనుక అధికారంలోకి వస్తే విశేషమైన లబ్ధి కలగనుంది.50ఏళ్ళ నుంచే పెన్షను అందనుంది. జిల్లాలో సుమారు 5.72 లక్షల మంది బీసీలుండగా ఇంచుమించు 2.50 లక్షల మందికి నెలనెలా రూ.4వేల చొప్పున పెన్షన్ లభించే అవకాశముంది. అలాగే 3.50 లక్షలమంది ఎస్సీలుండగా వారిలో 1.50 లక్షల మందికి పెరిగిన పెన్షన్ అందనుంది. ఎస్టీలు సుమారు 2 లక్షలమంది వుండగా వారిలో కూడా 80 వేలమంది దాకా పెన్షన్ పొందే వీలుంది.ఇక మైనారిటీలు 2.50 లక్షలుండగా 1.30లక్షలమంది వరకూ పెన్షన్ తీసుకునేందుకు ఆస్కారముంది.అదే విధంగా హజ్ యాత్రకు వెళ్ళే ముస్లింలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందనుంది.ప్రతి మసీదుకూ నెలనెలా నిర్వహణకు రూ.5వేల సాయం అందుతుంది. ఇమామ్‌లకు రూ. 10వేలు, మౌజన్‌లకు రూ. 5వేల వంతున గౌరవ వేతనం లభించనుంది. క్రిస్టియన్లకు కూడా జెరూసలెం యాత్రకు ఆర్థికసాయం అందే అవకాశం వుంది.

రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్న గాలేరు-నగరి

గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేస్తామని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ రైతాంగంలో ఆశలు రేకెత్తిస్తోంది. శ్రీకాళహస్తి,సత్యవేడు, నగరి నియోజకవర్గాల్లోని పలు మండలాలకు సాగు, తాగునీటిని అందించే ఈ ప్రాజెక్టు గత టీడీపీ ప్రభుత్వంలో పురోగతికి నోచుకోగా ప్రస్తుత ప్రభుత్వం టెండర్లు కూడా రద్దు చేసి పనులు ఆపేసిన సంగతి తెలిసిందే. ఐదేళ్ళుగా ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయిన స్థితిలో రైతులు ఈ ప్రాజెక్టుపై ఆశలు వదిలేసుకున్నారు. ఈ తరుణంలో టీడీపీ మిత్రపక్షాలతో ప్రాజెక్టు పూర్తికి హామీ ఇవ్వడంతో రైతుల్లో తిరిగి ఆశలు మొలకెత్తుతు న్నాయి. అలాగే గతంలో జిల్లాలోని మెట్ట రైతులకు ఎంతో మేలు చేసిన 90శాతం సబ్సిడీతో డ్రిప్ సదుపాయాన్ని తిరిగి అమలు చేస్తామని ఎన్డీయే కూటమి ప్రకటించడం పట్ల రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకాన్ని కూడా నిలిపేసిన సంగతి తెలిసిందే.



కూటమి వైపు యువత చూపు

టీడీపీ కూటమి మేనిఫెస్టోలో యువతకు అమిత ప్రాధాన్యత ఇచ్చింది. ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయడంతో పాటు ఫీజులను నేరుగా కాలేజీలకు చెల్లించనున్నారు. అలాగే నిరుద్యోగ యువతకు జిల్లాలో కనీసం లక్ష ఉద్యోగాలు ప్రైవేటు రంగంలో లభించనున్నాయి.అలా లభించే వరకూ నిరుద్యోగ యువతకు భృతి కింద నెలకు రూ.3వేలు చెల్లించనున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీతో పాటు ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామ న్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎంఎస్ఎంఈ లలో ప్రోత్సాహం అందించనుంది. నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు పనికొచ్చేలా డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు కానున్నాయి.వీటన్నింటికీ మించి గంజాయి, డ్రగ్ మాఫియాపై వంద రోజుల్లో కఠిన చర్యలు తీసుకుంటామన్న హామీతో తిరుపతి వంటి గంజాయి ప్రభావం అధికంగా వున్న ప్రాంతాలకు మేలు జరగనుంది.



సంక్షేమ పథకాల వరద!

ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడితే జిల్లాలో సంక్షేమ పథకాలు వరదలా లబ్ధిదారులను ముంచెత్తడం ఖాయమనిపిస్తోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ కానుకలను పునరుద్ధరించనున్నారు.అలాగే పేద వర్గాలకు చెందిన యువతుల వివాహాల సందర్భంగా కళ్యాణమస్తు, షాదీ తోఫా పేర్లతో అందజేసే పెళ్లి కానుకలను కూడా తిరిగి అమలు చేయనున్నారు. డ్రైవర్ల కార్పొరేషన్ ఏర్పాటు, అందరు డ్రైవర్లకూ ప్రమాద బీమా, ఆరోగ్య బీమాలతో పాటు ఏటా రూ. 15 వేల ఆర్థిక సాయం, జీవో 21 రద్దు, జరిమానాల భారం తగ్గింపు, గ్రీన్ ట్యాక్స్ తగ్గింపు వంటి హామీలు వాహన రంగంలోని డ్రైవర్లకు అమిత మేలు చేకూర్చనున్నాయి.పేద కుటుంబాలకు చంద్రన్న బీమా పథకం ద్వారా సహజ మరణానికి రూ. 5లక్షలు, ప్రమాద మరణానికి రూ.10లక్షల చొప్పున చెల్లించనున్నారు. దివ్యాంగులకు రూ. 6 వేలు, పూర్తి వైకల్యం వున్న వారికి రూ. 15 వేలు, కిడ్నీ, తలసేమియా వ్యాధిగ్రస్తులకు నెలకు రూ. 10 వేల చొప్పున పెన్షన్లు పెంచి అందించనున్నారు. పేదలకు పట్టణాల్లో 2సెంట్లు, గ్రామాల్లో 3సెంట్ల చొప్పున ఇళ్లస్థలాలు ఇవ్వడంతో పాటు ఇప్పటికే మంజూరైన స్థలాల్లో ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నారు.

ఉద్యోగులకు తీపి కబురు

ఎన్డీయే కూటమి మేనిఫెస్టో జిల్లాలోని ఉద్యోగులకు తీపి కబురు అందించింది. జిల్లాలోని 26,671మంది ఉద్యోగులకు ఐఆర్ అందడంతో పాటు ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు అందనున్నాయి.అలాగే పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వల్ల జిల్లాలోని 17 వేల మంది పెన్షనర్లకు కూడా నెల నెలా 1వ తేదీనే పెన్షన్లు అందించనున్నారు. జిల్లాలోని 1272మంది కాంట్రాక్టు, 3700 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలన్నీ వర్తించనున్నాయి.అలాగే జిల్లాలోని 11వేలమంది వలంటీర్లకు గౌరవ వేతనం రెట్టింపు కానుంది. ఇపుడు వైసీపీ ప్రభుత్వం రూ. 5 వేలు ఇస్తుండగా అది రూ. 10 వేలకు పెరగనుంది. అలాగే పాడి రైతులకు మేలు చేసే గోపాల మిత్రలను తిరిగి నియమించనున్నారు.

పట్టణాల్లో మళ్ళీ అన్నా క్యాంటీన్లు

టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే అన్నా క్యాంటీన్లు తిరిగి ఏర్పాటు కానున్నాయి.అదే జరిగితే తిరుపతి నగరంతో పాటు శ్రీకాళహస్తి, పుత్తూరు, నాయుడుపేట, సూళ్ళూరుపేట,గూడూరు,వెంకటగిరి పట్టణాల్లో పేదలకు, రోజు కూలీలకు, పేద విద్యార్థులకు, రోగులకు, వారి సహాయకులకు ఎంతో మేలు జరగనుంది.

రేపు చంద్రగిరిలో హలో....లోకేష్ కార్యక్రమం

చంద్రగిరి, ఏప్రిల్ 30: చంద్రగిరి మండలంలోని అగరాల సమీపంలో గురువారం సాయంత్రం హలో లోకేష్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిలో అగరాల సమీపంలోని నారాయణ కళాశాల ఎదురుగా ఉన్న స్థలంలో గురువారం సాయంత్రం 3గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి హాజరు కానున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువతనుద్దేశించి ప్రసంగించనున్నారు.టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆధ్వర్యంలో సభాస్థలంలో కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.బుధవారం రాత్రికే లోకేష్ తిరుపతికి చేరుకోనున్నారు.

వరదల సమయంలో కన్పించలేదే?

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కిలివేటిని నిలదీసిన కట్టువపల్లివాసులు

దొరవారిసత్రం, ఏప్రిల్ 30: 'మా గ్రామానికి మీరు ఏం చేశారు... తుపాన్ సమయంలో వరదలు వస్తే కనీసం మా వైపు చూడలేదు... మాకెందుకు వరద బియ్యం ఇప్పించలేదు... గతంలో జగన్ సీఎం కాలేదు అని చెప్పావు...జగన్ సీఎం అయ్యాక ఈ ఐదేళ్ల మా ఊరిని ఏం అభివృద్ధి చేశావు' అంటూ సూళ్లూరుపేట వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్యను కట్టువపల్లి గ్రామస్తులు నిలదీశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కిలివేటి దొరవారిసత్రం మండలం కట్టువపల్లికి మంగళవారం వెళ్లారు.గ్రామాన్ని అభివృద్ధి చేయలేదని, పథకాలు అందరికీ అందలేదంటూ గ్రామస్తులు ప్రశ్నించారు. అయితే ఎమ్మెల్యే సంజీవయ్య ప్రభుత్వ పథకాలను వల్లెవేస్తూ అర్హులందరికీ ఈ పథకాలు అందాయని చెప్పుకొచ్చారు. అర్హత లేని వారికే పథకాలు అంది ఉండవంటూ ముందుకు కదిలారు.





వడదెబ్బతో మహిళ మృతి



మల్లాపు పుట్టమ్మ (ఫైల్ ఫొటో)

వాకాడు, ఏప్రిల్ 30:వడదెబ్బతో మరొకరు మృతి చెందారు.వాకాడు మండలం నిడిగుర్తి పంచాయతీ పరిధిలోని బాలాజీనగర్‌కు చెందిన మల్లాపు పుట్టమ్మ(52) మంగళవారం వేరుశనగ చేనులో పనిచేస్తున్న భర్తకు మధ్యాహ్నం భోజనం తీసుకువెళ్లింది. తిరిగి వస్తుండగా ఎండ తీవ్రతకు ఒక్కసారిగా కుప్పకూలింది. గమనించిన గ్రామస్తులు సమాచారం అందజేయగా కుటుంబసభ్యులు పుట్టమ్మను ఆస్పత్రికి తరలించారు.అయితే మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందింది.

రుయాలో ఆరు నెలల చిన్నారికి కిడ్నీ శస్త్ర చికిత్స



కోలుకున్న బాలుడితో వైద్యాధికారులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 30: రుయాస్పత్రిలో ఆరు నెలల చిన్నారికి కిడ్నీ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. వివరాలను మంగళవారం సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభ మీడియాకు తెలిపారు. చిత్తూరు జిల్లా ఎస్ఆర్‌పురం మండలానికి చెందిన కౌశిక్ బాబు అనే ఆరు నెలల బాలుడు.. పుట్టినప్పటి నుంచే కిడ్నీ అడ్డం తిరిగి బాధపడుతున్నాడు. వారం కిందట సమస్య ఎక్కువ కావడంతో తల్లిదండ్రులు రుయా చిన్నపిల్లల విభాగానికి బాలుడిని తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి, కిడ్నీలో చీము చేరి.. పరిస్థితి విషమంగా ఉన్నట్లు గుర్తించారు. వెంటనే నిపుణులైన డాక్టర్ జగదీష్, డాక్టర్ రాజ్‌కిరణ్, డాక్టర్ మనోహర్‌లు బాలుడికి అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సను చేశారు. చీమును తొలగించడంతోపాటు కిడ్నీని సరైన క్రమంలో అమర్చారు. ఇటువంటి సర్జరీ ఇప్పటి వరకు రుయాస్పత్రిలో చేయలేదని ఇదే మొదటిదని, వైద్యబృందాన్ని రవిప్రభ అభినందించారు.ఇటువంటి సర్జరీ కార్పొరేటు ఆస్పత్రుల్లో చేయాలంటే రూ.లక్షలు ఖర్చవుతాయని చెప్పారు.



ఎన్డీయే మేనిఫెస్టోతోనే సంక్షేమం

టీడీపీ సీనియర్ నేత శ్రీహరి నాయుడు



నాని గెలుపుకోసం సాయినగర్‌లో ప్రచారం చేపడుతున్న శ్రీహరి నాయుడు

తిరుపతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి తరఫున టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో పాటు, మంగళవారం విడుదల చేసిన మేనిఫెస్టోతోనే అందరికీ సంక్షేమం అందుతుందని టీడీపీ సీనియర్ నేత, తిరుపతి రూరల్ ఇన్‌చార్జి శ్రీహరి నాయుడు అన్నారు. చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని గెలుపు కోసం ఆయన సాయినగర్‌లో విస్తృతంగా పర్యటించారు. చంద్రగిరిలో నానికి సైకిల్ గుర్తుపై, తిరుపతిలో కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులకు గాజుగ్లాసు గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఆయనతోపాటు పార్టీ నాయకులు చందు, ప్రకాష్, కవిత, ప్రతాప్, సన్నీ, మని, సదా పాల్గొన్నారు.

నానీ గెలుపు కోసం గంగమ్మకు పొంగళ్లు



గంగమ్మకు పొంగళ్లు పెడుతున్న తిరుమలరెడ్డి దంపతులు

రామచంద్రపురం, ఏప్రిల్ 30: రానున్న ఎన్నికల్లో చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యేగా పులివర్తి నాని గెలుపు కోసం రాయలచెరువుపేటలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, మాజీసర్పంచ్ మాధవి ఆధ్వర్యంలో మంగళవారం గంగమ్మకు పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి వేట పొంగళ్లు, మొక్కులు చెల్లించుకున్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు.

తిరుపతిలో అరాచకాలకు ఇక చెక్

ఆయన ప్రెస్‌మీట్ అంటే మీడియా మైకులన్నీ చెవులు రిక్కిస్తాయి. వైసీపీ నాయకుల మీద ఆయన విసిరే పంచ్ డైలాగులు వైరల్ అవుతాయి. ఎంత పెద్ద నాయకులనైనా జంకుగొంకు లేకుండా దడదడలాడించే నాయకుడిగా కిరణ్‌రాయల్‌కి పేరు. జనసేన తిరుపతి అభ్యర్థి ఎంపికపై తొలుత అలిగిన కిరణ్ రాయల్ పవన్ కల్యాణ్ మాటలతో అసంతృప్తిని ఆవల పెట్టి ఆరణి శ్రీనివాసులు విజయం కోసం కృషి చేస్తున్నారు. తిరుపతి రాజకీయ వర్తమాన చిత్రంపై కిరణ్‌రాయల్‌తో ఫటాఫట్ ఇంటర్వ్యూ..

భూమన తండ్రీ కొడుకులు వసూల్ రాజాలు

అభినయరెడ్డి గెలిస్తే తిరుపతిలో ఇళ్ల స్థలాలు కూడా కాపాడుకోలేం

రౌడీలను పోషిస్తున్న పార్టీ వైసీపీ

తిరుమల నుంచి ఓ కులాన్ని తరిమేయాలని కుట్ర

కిరణ్ రాయల్



ఫటాఫట్!

? తిరుపతి అసెంబ్లీకి కూటమి అభ్యర్థి ఎంపికపై తీవ్రంగా వ్యతిరేకించిన మీరు ఎలా రాజీపడ్డారు. డబ్బు తీసుకున్నారని మీపై ప్రచారం జరిగింది కదా.

! డబ్బు తీసుకుని రాజీ పడిపోయివుంటే నాకోసం ప్రత్యేకంగా పవన్ కల్యాణ్, నాగబాబు తిరుపతికి ఎందుకొస్తారు? చివరికి పార్టీ అభ్యర్థి బీఫామ్ కూడా పిఠాపురానికి నన్ను పిలిపించి చేతిలో పెట్టి గెలుపు బాధ్యతను నా భుజాన పెట్టారు. నాకు ఇచ్చిన గౌరవాన్ని నేను నిలబెట్టుకుంటాను. ప్రత్యర్థులు రూ. కోట్లు ఆఫర్ చేసినా పవన్ కల్యాణ్‌పై అభిమానంతోనే నేను చలించలేదు.

? ఈ ఎన్నికల్లో మీనినాదం ఏమిటి.

! భూమన తండ్రీ కొడుకుల అవినీతి, అరాచకాలు ఇక చెల్లవు అన్నదే మా నినాదం. వాళ్లిద్దరూ వసూల్ రాజాలుగా మారారు. రోడ్ల విస్తరణ పేరిట ఇళ్లు, భవనాలు కూల్చేస్తామని ప్రజలనూ, వ్యాపారాలు దెబ్బతీస్తామని వ్యాపారులను బెదిరిస్తున్నారు. వసూళ్ల బాధ్యత కార్పొరేటర్లకు అప్పగించారు. తిరుమలలో వ్యాపారులు, కాంట్రాక్టర్ల నుంచీ వసూళ్లు మొదలుపెట్టారు. ఒక కులాన్ని పూర్తిగా తిరుమల నుంచి తరిమేయాలని చూస్తున్నారు. వారికి ఈవో ధర్మారెడ్డి సహకరిస్తున్నాడు. వీటినే ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం.

?తిరుపతిలో భూ వివాదల గురించి..

! తిరుపతిలో స్థలం ఖాళీగా పెట్టాలన్నా, ఇల్లు కట్టుకోవాలన్నా, బోరు వేయాలన్నా జనం భయపడుతున్నారు. యాభై అంకణాల స్థలముంటే దాన్ని కాపాడుకునేందుకు కుటుంబమంతా కాపలా కాయాల్సిన దుస్థితి వుంది. వైసీపీ నేతల భూ దందాతో తిరుపతి ప్రతిష్ఠ దెబ్బతినింది.

? తిరుపతిలో చిత్తూరు రౌడీలను దించారు అని భూమన ఆరోపిస్తున్నారు కదా.

! తిరుపతిలో రౌడీలు, గూండాలు వైసీపీలోనే వున్నారు. ఎన్నికల్లో గొడవలు చేసి ప్రత్యర్థులను బెదరగొట్టిన వారికి భవిష్యత్తులో పదవులు ఇస్తామని వారు ఆశ చూపుతున్నారు. రౌడీయిజం, దాడులు, దౌర్జన్యాలు, కబ్జాలు ప్రవేశపెట్టిన ఘనత వైసీపీ నేతలదే. నిరంతరం అరాచకాలతో తిరుపతి ప్రశాంతతను చెడగొట్టారు.

? తిరుపతి ప్రజలకు మీరిచ్చే భరోసా ఏమిటి.

! ఎన్డీయే ప్రభుత్వం రాగానే కబ్జా అయిన ఆస్తులను బాధితులకు తిరిగి అప్పగిస్తాం. తిరుపతికి పూర్వ వైభవం తీసుకొస్తాం. కూటమి అధినేతలు చంద్రబాబుకు, పవన్ కల్యాణ్‌కు శ్రీవారిపై ఎనలేని భక్తివిశ్వాసాలు, తిరుపతిపై ప్రేమ వున్నాయి. అందుకే తిరుపతిలో ప్రశాంతతను కాపాడాలంటే కూటమి అభ్యర్థి గెలవాలి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఉమ్మడి మేనిఫెస్టో సూపర్ సక్సెస్

- అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం ఎన్డీయేతోనే సాధ్యం
- జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎన్డీయే కూటమి నేతలు

తిరుపతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 'అభివృద్ధి, సంక్షేమానికి ఉమ్మడి మేనిఫెస్టో పెద్దపీట వేసిందని టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎనిమిది లక్షల కోట్ల భారం ప్రజలపై పడిందని చెప్పారు. మంగళవారం 10, 11 డివిజన్లలో టీడీపీ సీనియర్ నేతలు మబ్బు దేవనారాయణ రెడ్డి, పులుగోరు మురళి నేతృత్వంలో నడివీధి గంగమ్మ ఆలయంలో పూజలు చేశాక ఇంటింటి ప్రచారం ప్రారంభమైంది. జనసేన సీనియర్ నేత పొలకల మల్లికార్జున్ నాయకత్వంలో 11వ వార్డుకు చెందిన వైసీపీ నాయకురాలు సరస్వతి, ఆమె అనుచరులు జనసేనలో చేరారు. సరస్వతితోపాటు రామకృష్ణ, వినోద్ కుమార్, హరిబాబు, సురేష్‌లకు ఆరణి శ్రీనివాసులు పార్టీ కండువాలు కప్పి జనసేనలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆరణి మాట్లాడుతూ.. మహిళలు, యువతకు ఉమ్మడి మ్యానిఫెస్టో అధిక ప్రాధన్యం ఇచ్చిందన్నారు. నిరుద్యోగంలో దేశంలో రెండో స్థానంలోకి రాష్ట్రాన్ని చేర్చిన ఘనత సీఎం జగన్‌కి దక్కిందని విమర్శించారు. యువతకు ఉద్యోగాల కోసం మెగా డీఎస్సీతోపాటు ఏటా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేస్తామని ఉమ్మడి మ్యానిఫెస్టోలో ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహ యాదవ్, ఊకా విజయ్ కుమార్, ఆర్సీ మునికృష్ణ, మన్నెం శ్రీనివాసుల నాయుడు, కంకణాల రజనీకాంత్ నాయుడు, బ్రహ్మానంద రెడ్డి, ఈతమాకుల హేమంత్ కుమార్ యాదవ్, బీజీ కృష్ణ యాదవ్, బీజేపీ నాయకులు వరప్రసాద్, పొనగంటి భాస్కర్, జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్, సుభాషిణి, రాజారెడ్డి, గుత్తా నాగారాజు, సరితా నాగరాజు, బండ్ల లక్ష్మీపతి రాయల్ తదితరులు పాల్గొన్నారు.



ఆరణి శ్రీనివాసులు, సుగుణమ్మ, కూటమి నేతలకు గజమాలతో స్వాగతం

బాబు వస్తేనే జాబ్ వస్తుంది

రామచంద్రాపురం, ఏప్రిల్ 30: రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తేనే యువతకు జాబ్ వస్తుందని జిల్లా టీడీపీ యువత ప్రధాన కార్యదర్శి ఢిల్లీనాథరెడ్డి అన్నారు. మండలంలోని గంగిరెడ్డిపల్లిలో మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాల పేరుతో ప్రజలను ఐదేళ్లుగా జగన్ దగా చేశారన్నారు. చంద్రబాబు కోసం ప్రజలు వెయ్యి కళ్లతో ఎదరు చూస్తున్నారన్నారు. జిల్లా కార్యదర్శి గురుప్రసాద్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు చెంచురామరెడ్డి, శేషాద్రి, గోపి, వాసుయాదవ్ పాల్గొన్నారు.

కూటమి విజయం లాంఛనమే: పులివర్తి నాని





పులివర్తి నాని సమక్షంలో టీడీపీలో చేరిన ఊటబావుపల్లెకు చెందిన వైసీపీ నేతలు, పాకాలలో ముస్లిం సోదరుల ఆత్మీయ సమావేశంలో పులివర్తి సుధారెడ్డి

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 30: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాట కావడం లాంఛనమేనని చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని నెరబైలు, కమళ్లయ్యగారి పల్లె పంచాయతీల్లో ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నానీ మాట్లాడుతూ వైసీపీ పాలనతో ప్రజలు భయభ్రాంతులతో కాలం వెళ్లబుచ్చుతున్నారని తెలిపారు. మే 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రగిరి ఎమ్మెల్యేగా తనను అత్యంత మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తనను గెలిపిస్తే మ్యాంగో బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తానని హామి ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలతో పేదరిక నిర్మూలన జరుగుతుందన్నారు. ఊటబావులపల్లెకు చెందిన 50 కుటుంబాలు నెరబైలులో నానీ సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. టీడీపీలో చేరే వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

టీడీపీ పాలనలోనే ముస్లింల అభివృద్ధి

పాకాల, ఏప్రిల్ 30: తెలుగుదేశం పార్టీ పాలనలోనే ముస్లింల అభివృద్ధి సాధ్యమని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి అన్నారు. స్థానిక ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన ముస్లింల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న సుధారెడ్డి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. టీడీపీ ముస్లింల సంక్షేమం కోసం అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. పులివర్తి నానీని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. మండల ముస్లిం మైనార్టీ నాయకులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గెలుపు ముంగిట్లో టీడీపీ: వినీల్

తిరుచానూరు, ఏప్రిల్ 30: చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ గెలుపు ముంగిట్లో ఉందని, ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలు చూస్తుంటే భారీ మెజార్టీ ఖాయమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తనయుడు వినీల్ అన్నారు. మంగళవారం మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా తిరుపతి రూరల్ మండలం పాడిపేట పంచాయతీలో పర్యటించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. వినీల్ ఇంటింటికి తిరుగుతూ కూటమి మేనిఫెస్టోలోని అంశాలపై అవగాహన కల్పించారు. నిత్యం ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్న పులివర్తి నానీని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని పాడిపేట పంచాయతీ ప్రజలు వినీల్‌కు భరోసా ఇచ్చారు. రాష్ట్రానికి చంద్రబాబు సీఎం కావాలని, చంద్రగిరిలో పులివర్తి నానీని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలనికోరారు.



ప్రచారం చేస్తున్న పులివర్తి వినీల్

ఎంపీగా గెలిస్తే సముద్ర ముఖద్వారాల పూడిక తీయిస్తా

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు





గూడూరులో జరిగిన సమావేశంలో వరప్రసాదరావు తదితరులు - అక్కంపేటలో బీజేపీ నాయకులతో వరప్రసాదరావు భేటీ

గూడూరు, ఏప్రిల్ 30: తాను ఎంపీగా గెలిస్తే ఏడాదిలోగా సముద్ర ముఖద్వారాల పూడిక తీయిస్తానని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు హామీ ఇచ్చారు. మంగళవారం పట్టణంలోని సనత్ నగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్ర పర్యావరణ ఆంక్షలు సడలించి నిలిచిపోయిన పలు అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తానన్నారు. అమృత్ నిధులు తీసుకొచ్చి మున్సిపాల్టీలో అభివృద్ధి పనులు చేపడుతానన్నారు. కోతకు గురయ్యే ప్రాంతాలు సహా కండలేరుకు కాంక్రీట్ రివిట్‌మెంట్, గూడూరు చెరువు అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేయిస్తామన్నారు. నియంతలా వ్యవహరిస్తున్న సీఎం జగన్‌కు పరిపాలించే అర్హత లేదన్నారు. జగన్‌కు అహంకారం పెరిగిపోయిందని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. ఆయనే స్వయంగా సిలికా, క్వార్ట్జ్, మద్యం వంటి అక్రమ వ్యాపారాలు సాగిస్తూ కోట్ల రూపాయలను కొల్లగొట్టారన్నారు. నిరంకుశ వైసీపీని ఓడించేందుకు బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా ఏర్పడిందన్నారు. రానున్న ఎన్నికలో కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. అనంతరం విశ్రాంత బ్యాంకు మేనేజర్ నరసప్పను బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో చంద్రప్ప, పి.పురుషోత్తంరెడ్డి, గిరిరెడ్డి, కోటారెడ్డి, పి.కోటేశ్వరరావు, ఎ.బాలకృష్ణమనాయుడు, వై.వెంకటసుబ్బయ్య, మన్నెం శీనయ్య, వల్లూరు మోహన్, వినీష్, దిలీప్, బిందురెడ్డి, మనోజ్‌కుమార్, లక్ష్మీ, జీనత్, భవానీ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీ పాలనలో అభివృద్ధిపథంలో భారతదేశం....

మనుబోలు: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో మనదేశం అభి వృద్ధి పథంలో దూసుకెళ్తోందని వరప్రసాదరావు అన్నారు. సర్వేపల్లి నియోజకవర్గం మనుబోలు మండలం అక్కంపేటలో బీజేపీ నాయకుడు కృష్ణారెడ్డి నివాసంలో ఎన్డీఏ కూటమి నాయకులతో సమావేశమయ్యారు. ప్రపంచ దేశాల్లో ఎక్కడికెళ్లినా భారతదేశం పేరు చెప్పగానే మోదీని ప్రస్తావిస్తున్నారన్నారు. గాడి తప్పిన ఏపీ అభివృద్ధి చెందాలంటే అనుభవం కలిగిన చంద్రబాబు సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రవీంద్రరెడ్డి, సురేంద్రరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు

కూటమి ఓట్లను చీల్చేందుకు వైసీపీ కుట్ర

జనసేన నేత కిరణ్ రాయల్ ఆరోపణ



గాజు గ్లాసు గుర్తును చూపుతున్న కిరణ్ రాయల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 30: తిరుపతిలో కూటమి ఓట్లను చీల్చేందుకు వైసీపీ కుట్ర చేస్తోందని జనసేన నేత కిరణ్‌రాయల్ ఆరోపించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జనసేన ఓట్లను చీల్చడానికి ఇండిపెండెంట్ అభ్యర్థులతో భారీస్థాయిలో నామినేషన్లు వేయించారని చెప్పారు. గ్లాసును పోలిన బకెట్, పెన్ స్టాండ్ గుర్తులను ఏర్పాటు చేసి ఓటర్లను గందరగోళ పరిచేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును పోలిన ఆలూరు శ్రీనివాసులు చేత నామినేషన్ వేయించారని తెలిపారు. ఆరణి శ్రీనివాసుల వరుస సంఖ్య 3 అయితే, ఆలూరు శ్రీనివాసులుకు 4 వరుస సంఖ్య వచ్చేలా వైసీపీ పథకం ప్రకారం కుట్ర పన్నిందని ఆరోపించారు. ప్రజలు ఓటు వేసే ముందు అభ్యర్థి పేరు, గుర్తును క్షుణ్ణంగా పరిశీలించి ఓటు వేయాలన్నారు. తిరుపతి అసెంబ్లీకి నామినేషన్ వేసిన 46 మందిలో 25 మంది ఫ్యాన్ గుర్తుకు ఫ్యాన్స్ అని ఆరోపించారు. ఓటమి భయంతోనే ఇలాంటి కుట్రలకు వైసీపీ తెర లేపిందని అభిప్రాయపడ్డారు. తాజాగా కూటమి మేనిఫెస్టో సూపర్ హిట్ అని తెలిపారు. తిరుపతి అసెంబ్లీ ఎన్నికల గుర్తులు, అభ్యర్థుల పేర్లను ఎన్నికల కమిషన్ క్షుణ్ణంగా పరిశీలించి తగిన మార్పు చేర్పులు చేయాలని కోరారు. ఈసీపై తమకు నమ్మకం ఉందని అన్నారు. ఎన్నికల తర్వాత వైసీపీ నాయకులు ఇంటికి వెళ్లడం ఖాయమని స్పష్టం చేశారు. తిరుపతిలో కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు తప్పక గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు రాజారెడ్డి, సుభాషిణి, సుమన్‌బాబు, రాజేష్ ఆచారి, సాయిదేవ్ యాదవ్, చందన, రాజేంద్ర, భాను పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

గెలుపు ముంగిట్లో టీడీపీ: వినీల్




పులివర్తి వినీల్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న దృశ్యం

తిరుచానూరు, ఏప్రిల్ 30: పులివర్తి వినీల్ సమక్షంలో మంగళవారం వైసీపీ నుంచి నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. అవిలాల పంచాయతీకి చెందిన వరప్రసాద్, ఢిల్లీప్రకాష్, రాజా కార్తీక్, చంద్రకళ, మంజుల తదితరులకు పులివర్తి వినీల్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదే విధంగా బ్రాహ్మణపట్టు పంచాయతీలో కూడా పలువురు వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కన్నెప్పరెడ్డి, కార్తీక్, వెంకటేష్, బాలాజీ, సురేష్ తదితరులున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ పులివర్తి నానీ విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో పాల్గొనడం గొప్ప అవకాశం

- రాష్ట్ర అబ్జర్వర్ రామ్మోహన్ మిశ్రా



అధికారులకు సూచనలిస్తున్న రామ్మోహన్ మిశ్రా

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 30: ఎన్నికల విధుల్లో పాల్గొనడం గొప్ప అవకాశమని రాష్ట్ర ప్రత్యేక సాధారణ ఎన్నికల పరిశీలకుడు రామ్మోహన్ మిశ్రా అన్నారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై కలెక్టరేట్‌లో మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. హింసాత్మక, రీపోల్ ఘటనలకు తావులేకుండా అందరూ కలిసికట్టుగా కృషిచేయాలని సూచించారు. జిల్లాలో పారదర్శక ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ వివరించారు. కేంద్ర బలగాలను అన్ని నియోజకవర్గాలకు కేటాయించినట్లు ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తెలిపారు. జిల్లా ఎన్నికల పరిశీలకులు ఉజ్వల్‌కుమార్ ఘోష్, జ్యోతి, కైలాస్ వాంఖడే, అరవింద్ సాల్వే, జేసీ ధ్యానచంద్ర, మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్, డీఆర్వో పెంచలకిషోర్ పాల్గొన్నారు.

'మహాశక్తి'తో మహిళలకు పెద్దపీట



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

భాకరాపేట, ఏప్రిల్ 30: మహాశక్తి పథకంతో చంద్రబాబు మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లు మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు చిట్టెమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జ్ కొట్టే శివకుమార్ అన్నారు. మంగళవారం వారు చిన్నగొట్టిగల్లు, భాకరాపేట పంచాయతీల్లో ఇంటింటా తిరుగుతూ కరపత్రాల పంపిణీ చేసి, ప్రచారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ సునీత దామోదరం, మోహన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, విజయ శేఖర్ గౌడ్, వెంకటరత్నం, బావజాన్, లోకనాథం, కాకి వెంకటరమణ, గిరిబాబు, విజయకుమార్, మణి, చంద్రప్రకాష్, యశ్వంత్ రాయల్, తులసి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సన్మానం



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 30: చంద్రగిరి ఏఎస్‌ఐగా పనిచేస్తున్న టి.గుర్రప్ప, తిరుపతి ఈస్ట్ ఏఎస్‌ఐ వెంకటేశులు నాయుడు, డీసీఆర్‌బీ ఏఎస్‌ఐ భాస్కరరెడ్డి, సెబ్ ఇన్‌స్పెక్టర్ హేమంత్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ గంగిరెడ్డి పదవీ విరమణ పొందారు. వీరిని తిరుపతిలో మంగళవారం ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ సన్మానించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రాజేంద్ర, సెబ్ సూపరిటెండెంట్ శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మేడే ఘనంగా నిర్వహించండి

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 30: మేడేని బుధవారం ఘనంగా నిర్వహించాలని కార్మికులకు పలువురు నాయకులు సూచించారు. వీరిలో.. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు కందారపు మురళి, ఆర్.హరికృష్ణ ఉన్నారు.

ఐఐటీ, ఐసర్‌లలో జర్మన్ల బృందం



ఏర్పేడు, ఏప్రిల్ 30: తిరుపతి ఐఐటీ, ఐసర్‌ను జర్మనీ ప్రతినిధుల బృందం మంగళవారం సందర్శించింది. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య జర్మనీ ప్రతినిధుల బృందానికి స్వాగతం పలికారు. హైడెల్ బర్గ్ యూనివర్శిటీ ఆఫ్ కొలోన్ ప్రతినిధులు ఐఐటీలో ఇప్పటి వరకు నెలకొల్పిన విద్యార్థులకు సంబంధించి వసతిగృహాలు, కళాశాల భవనాలు, లేబోరేటరీలను సందర్శించారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ భారత్, జర్మనీ మధ్య బలమైన సహకారానికి భారీ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. రెండు దేశాల విద్యార్థులు, పరిశోధకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు.

మహిళా వర్సిటీకి నేడు జర్మన్ ప్రతినిధుల రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): యూనివర్సిటీస్ - ఇండో - జర్మన్ సైన్స్ అండ్ టెక్నాలజీ కో-ఆపరేషన్ కార్యక్రమంలో భాగంగా పద్మావతి మహిళా యూనివర్సిటీకి జర్మన్ యూనివర్సిటీ ప్రతినిధులు బుధవారం రానున్నారని వర్సిటీ పీఆర్వో శ్రీరజని తెలిపారు. ఉదయం 10గంటలకు యూనివర్సిటీ వీసీ భారతి, రిజిస్ట్రార్ రజనితో సమావేశం కానున్నారు. బోధన, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం, అవగాహనా ఒప్పందం వంటి అంశాలపై చర్చించనున్నారు. ఈ బృందంలో డాక్టర్ స్ట్రైక్‌జెన్ (గౌరెకీ యూనివర్సిటీ), డాక్టర్ సుసన్నే స్కెమిదిత్ (మగ్దెబర్గ్, రెక్టార్), డాక్టర్ సీమెన్ (డీన్), డాక్టర్ కెప్లెర్ట్ (మాలిక్యులర్ హెడ్), డాక్టర్ కాటెర్ ఫెల్డ్ (ఫ్యాకల్టీ డీన్), డాక్టర్ ఫ్రాన్సిస్కా, డాక్టర్ దీబన్, డాక్టర్ సబూర్‌బకత్, డాక్టర్ అమీష జైన్, డాక్టర్ విబుటి సుబ్రమణి ఉన్నారని తెలిపారు.

పద్మావతి అమ్మవారి సేవలో కర్ణాటక హైకోర్టు సీజే



తిరుచానూరు, ఏప్రిల్ 30: కర్ణాటక రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎన్వీ అంజరియా కుటుంబ సమేతంగా మంగళవారం రాత్రి తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు ఆయనకు సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు.

కల్వర్టును ఢీకొన్న కారు

- కర్ణాటకవాసి దుర్మరణం, నలుగురికి తీవ్ర గాయాలు



కల్వర్టును ఢీ కొన్నకారు, సుశీలమ్మ మృతదేహం

చంద్రగిరి, ఏప్రిల్ 30: కల్వర్టును కారు ఢీకొన్న ప్రమాదంలో కర్ణాటక వాసి ఒకరు దుర్మరణం చెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం బంగారుపేటకు చెందిన మురళీధర్, అమర్, ఉమా, అనుషా, సుశీలమ్మ ఆదివారం కారులో తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చారు. స్వామివారిని దర్శించుకుని సోమవారం రాత్రి సొంతూరుకు కారులో బయల్దేరారు. మార్గమధ్యంలో పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై అర్ధరాత్రి ఒంటి సమయంలో చంద్రగిరి మండలం ముంగిలిపట్టు వద్ద ఉన్న కల్వర్టును కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుశీలమ్మ(55) అక్కడికక్కడే మృతి చెందారు. వాహనంలోని మిగిలిన నలుగురికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను 108 వాహనంలో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలలో యువకుడి అనుమానాస్పద మృతి



తిరుమల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తిరుమల వన్‌టౌన్ ఎస్ఐ వివరాల మేరకు.. శ్రీవారి ఆలయానికి సమీపంలోని రాంబగీచ విశ్రాంతి భవన సముదాయంలో 27వ నెంబరు గదికి సమీపంలో సుమారు 29 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి ఎలాంటి కదలికలు లేకుండా పడి ఉండటాన్ని అక్కడి వ్యాపారులు, భక్తులు గుర్తించారు. టీటీడీ సెక్యూరిటీ సిబ్బందికి సమాచారమిచ్చారు. దీంతో వారు ఘటనా ప్రాంతానికి చేరుకుని 108 అంబులెన్స్‌లో తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు 0877 2263654, 94407 96771 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

తిరుపతి

తిరుమలలో నేటినుంచి 30 పోలీస్ యాక్టు

తిరుమల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం నుంచి ఈనెల 31వ తేదీవరకు 30 పోలీస్ యాక్టు అమలు చేయనున్నారు. ఈ మేరకు తిరుమల డీఎస్పీ శ్రీనివాసాచారి తెలిపారు. తిరుమలలో బహిరంగ ప్రదేశాల్లో ఏదైనా సమావేశాలు, ఊరేగింపులు వంటివి చేయాలనుకుంటే ముందస్తుగా పోలీసుల నుంచి అనుమతి పొందాలని స్పష్టం చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోలకు దరఖాస్తు చేసుకుని, అనుమతి పొందాకే కార్యక్రమాలు చేసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.10 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.10 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి, మంగళవారం ప్రకటించింది. సోమవారం 77,673 మంది శ్రీవారిని దర్శించుకోగా, 30,607 మంది తలనీలాలు సమర్పించారు. కాగా,రాష్ట్రఎన్నికల అబ్జర్వర్ రామ్మోహన్ మిశ్రా, బెంగళూరుకు క్యాట్‌బెంచ్ మెంబర్ ప్రకాష్ కె.గుప్తా స్వామివారిని దర్శించుకున్నారు.

వైసీపీ కుట్రలను తిప్పికొడతాం

జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్



కిరణ్‌ను ఆత్మీయంగా పలకరిస్తున్న స్థానికులు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 30: వైసీపీ కుట్రలను తిప్పికొడతామని జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ హెచ్చరించారు. టీడీపీ, బీజేపీ బలపరిచిన జనసేన కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపు కోసం మంగళవారం 27వ డివిజన్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ఓటర్లను పలకరిస్తూ గాజు గ్లాసుకు ఓటు వేయాలని కోరారు. రౌడీలను, గుండాలను తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయని, ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కిరణ్‌ని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ సమీప బంధువు జయకుమార్ ఆలింగనం చేసుకుని, మనదే గెలుపని సంబరపడ్డారు. ప్రజలు జగన్‌ను నమ్మే పరిస్థితి లేదని, ప్రచారాన్ని వైసీపీ అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి, డివిజన్ టీడీపీ, జనసేన అధ్యక్షులు ఆదికేశవులు, ప్రతాప్, దేవా, సుమన్‌బాబు, సాయిభాస్కర్, రమేష్, వెంకటేశ్వర్లు, యశ్వంత్, భాను, వీరమహిళలు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

గాజు గ్లాసు గుర్తుపై వైసీపీ కుట్రలు ఫలించవు

ఊకా విజయకుమార్



36వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న ఊకా విజయ కుమార్

తిరుపతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ధర్మబద్ధంగా గెలవలేమని తెలిసి.. జనసేన పార్టీ గుర్తు గాజుగ్లాసుతో పోలిన గుర్తులను, అభ్యర్థుల పేర్లతో నామినేషన్లు వేయించి గెలవాలని చూస్తున్న వైసీపీ కుట్రలు ఫలించవని టీడీపీ సీనియర్ నేత ఊకా విజయ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన 36వ డివిజన్ టీనగర్, మంచాలవీధి, గాలివీధి, ఇర్లానగర్, సాయిరాం వీధిలో గాజుగ్లాసుకు ఓటు వేయాలని విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి రవింశకర్ (సుబ్బు యాదవ్), వార్డు టీడీపీ అధ్యక్షుడు శంకర్ యాదవ్, వార్డు జనసేన అధ్యక్షుడు వినోద్ రాయల్, బూత్ కన్వీనర్లు కృష్ణ, సుభాష్, సిరాజ్, అబ్దుల్లా, ఆముదాల వెంకటేష్, ప్రేమ్, యేసు, శేషాద్రి, మధు, కేఎస్ లత పాల్గొన్నారు.

రాజా రెడ్డి కలుపుమొక్క కరుణాకర రెడ్డి.! ● భాష, యాస అంతా కడప కల్చర్

తాము చేసే పనులన్నీ ప్రత్యర్థులపై నెట్టే యత్నం ● 34వేల దొంగ ఓట్ల వెనుక 34 ఏళ్ల కుర్రాడు సూత్రధారి

అదనపు బలగాలతో ఎన్నికలు జరగాలి ● మీడియా సమావేశంలో ఎన్డీయే నేతల ధ్వజం

తిరుపతిలో కడప రౌడీలు దిగేశారు

తిరుపతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు వైసీపీ తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి అభినయ్ రెడ్డి.. అరాచకాలు, అకృత్యాలపై ఎన్డీయే (టీడీపీ, బీజేపీ, జనసేన)నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కడప రౌడీలను పెద్ద ఎత్తున తిరుపతిలో దించి అరాచకాలకు సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్ రాజారెడ్డి కలుపు మొక్కగా తిరుపతిలో పెరిగిన కరుణాకర రెడ్డి వటవృక్షమై, తన కొడుకు రూపంలో విషవృక్షాన్ని పెంచాడని విమర్శించారు. మంగళవారం ఎన్డీయే నేతలు మీడియాతో మాట్లాడారు. కరుణాకరరెడ్డి, అభినయ్ రెడ్డిలకు ప్రశ్నల వర్షం కురిపించారు. భూమన దుర్మార్గాలన్నింటిపై ఎన్నికల అధికారులకు సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేస్తున్నామని, ధర్మంగా ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అన్నా రామచంద్రయ్య, భట్టే కీర్తి, పుష్పావతి, కృష్ణ యాదవ్, రాజా రెడ్డి, సుభాషిణి, అన్నా సంధ్య కూడా పాల్గొన్నారు. ఈ సమావేశంలో నాయకుల మాటలు వాళ్ల మాటల్లోనే..

దయ్యాలు వేదాలు వల్లించినట్లు లేదూ?

చిత్తూరు రౌడీలను రప్పించి 25 మంది ఇండిపెండెంట్లను బరిలోకి దింపారని అబద్ధాలు ప్రచారం చేస్తున్న మీరు.. మీ పుత్రరత్నం మిత్రులే 13 మంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో లేరని చెప్పగలరా? వైఎస్ రాజా రెడ్డి పేరుచెప్పుకుని తిరుపతిలో భూదందాలు, దౌర్జన్యాలకు పాల్పడిందెవరు? దివంగత ఎమ్మెల్యే వెంకటరమణపై దాడిచేసి జైలు శిక్ష అనుభవించ లేదా? మేయర్ పదవిని బీసీలకు ఎరజూపి, డిప్యూటీ మేయర్ ముసుగులో మున్సిపల్ కార్పొరేషన్‌ను లూటీ చేసిందెవరు? రోడ్ల విస్తరణ పేర్లతో టీడీఆర్ బాండ్ల రూపంలో వేలాది కోట్లను కొల్లగొట్టిందెవరు? నిర్మాణంలో ఉన్న గరుడ వారధి పనులను నిలిపివేసి, కాంట్రాక్టు సంస్థనుంచి కోట్లాది రూపాయలు కమీషన్ తీసుకోలేదని చెప్పగలవా? వీధి వీధిలో గంజాయి బ్యాచ్‌లను ప్రోత్సహిస్తున్నది వైసీపీ నాయకులు కాదా? భూమన కరుణాకర రెడ్డి నోట సౌమ్యులమనే మాట వింటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు లేదా? 2009, 2014 ఎన్నికల్లో కడపనుంచి రౌడీలను తెప్పించి అరాచకాలను సృష్టించింది నువ్వు కాదా?

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి జనసేన అభ్యర్థి

కేంద్రం పర్యవేక్షణలోనే ఎన్నికలు జరగాలి

కార్పొరేషన్ ఎన్నికల్లో ఎలక్షన్ కాకుండా సెలక్షన్ జరిగిందని తిరుపతి ప్రజలంతా చెప్పుకుంటున్నారు. ఎడ్యుకేషన్, హాస్పిటల్ హబ్‌గా ఉన్న తిరుపతిలో దేశం మొత్తం నివ్వెరపోయేలా ఎన్నికలు జరిగాయి. సార్వత్రిక ఎన్నికల్లో నగరంలోని 267 బూత్‌లన్నీ సమస్యాత్మకంగానే భావించి కేంద్ర బలగాలు, మైక్రో అబ్జర్వర్లతో ఎన్నికలు జరగాలని కోరుతున్నాం. నగర ప్రజలు కూడా అదే కోరుతున్నారు. తిరుపతి ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసుకునే అవకాశం కల్పించాలని అధికారులను కోరుతున్నాం.

- సుగుణమ్మ, మాజీ ఎమ్మెల్యే

అధికార అహంకారం

తండ్రి ఎమ్మెల్యే అన్న అహంకారంతో అభినయరెడ్డి మాట్లాడుతున్నాడు. టీటీడీ, మున్సిపాల్టీలోని ప్రతిపనిలోనూ కమీషన్లు తీసుకున్నారు. ప్రజాపక్షంలో అధికారులు ఉండకపోతే చట్టం ముందు నిలబెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. డొక్కు డబుల్ డెక్కర్ బస్సుల కోసం వందలాది చెట్లు నరికేశారు. కొండకొచ్చే భక్తులు, పాదచారులకు నీడలేకుండా చేశారు. అదనపు బలగాలతో తిరుపతిలో ఎన్నికలు జరగాలి. ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టిపెట్టాలి.

-భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ నేత

ఆరణికి ఆదరణ చూసి ఓర్వలేకనే

జీవకోనలో ప్రచారంలో ఉన్న మా వాహనానికి అనుమతి ఉన్నప్పటికీ పోలీసులతో అడ్డుకున్నారు. ఎన్డీయే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అడ్డుకునే చర్యలకు దిగుతున్నారు. తిరుపతిలో సజావుగా ఎన్నికలు జరగకుండా ప్రయత్నిస్తున్నది మీరేనని ప్రజలు గమనిస్తున్నారు. ఎన్ని వేషాలు వేసినా మీ ఆటలకు ముగింపు పడింది.

- డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, జనసేన నేత



మీడియా సమావేశంలో వాల్ పోస్టర్లు చూపుతున్న ఎన్డీయే నాయకులు

మా బీసీలపై దాడిచేసి మాపైనే కేసులా?

టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి.. చిత్తూరు నుంచి రౌడీలు వచ్చారని చెబుతున్నారు. మరి కడప నుంచి వచ్చిన రౌడీల సంగతేంటి? వారిపై నిఘా ఉంచాల్సిన అవసరం అధికారులపై ఉంది. ఫేక్ ఐడీ కార్డులు సృష్టించి తిరుపతి ఎన్నికలను అభాసుపాలు చేసిన చరిత్ర మీది. గిరిపురంలో మా బీసీ నాయకులపై దాడిచేశాక వారెళ్లి ఆస్పత్రుల్లో పడుకుని మాపైనే కేసులు పెట్టారు. టీడీఆర్ బాండ్లకు కక్కుర్తిపడి అవసరంలేని చోట్ల నాలుగు రోడ్లు వేసి అభివృద్ధి చేశామని చెప్పడం కాదు. నిర్మాణాత్మక అభివృద్ధి అంటే టీడీపీ ఏం చేసిందో తెలుసుకోండి.

- నరసింహ యాదవ్, టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు

సకల అరాచకాలకూ మీరే కారణం

తనకు తాను సుద్దపూసలా, మరో మహాత్మగాంధీలా అభివర్ణించుకుంటున్న కరుణాకరరెడ్డి మాటలు వింటుంటే నవ్వొస్తుంది. భూదందాలకు, అక్రమాలకు, రౌడీయిజానికి, మత్తుపదార్థాల విచ్చలవిడి వినియోగానికి ఆ కుటుంబమే కారణం. రాజారెడ్డి మరోరూపమే ఆయన. 34వేల దొంగ ఓట్ల కుంభకోణం వెనుక సూత్రధారి 34ఏళ్ల యువకుడైన అభినయ్‌రెడ్డి. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ఎపిక్ కార్డులను డౌన్‌లోడ్ చేసిన కుర్రోడికి అధికారం ఇస్తే విషవృక్షంలా నగరాన్ని చెప్పుచేతుల్లోకి తీసుకుంటారు.

- సామంచి శ్రీనివాస్, బీజేపీ నేత





ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 30: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడిలో జాతర ముందు మూడో మంగళవారం పూజాధికాలు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయం మేరకు అమ్మవారిని, గర్భాలయాన్ని పసుపుకొమ్ములతో తీర్చిదిద్దారు. ఉదయమే అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి, అలంకరణగా బంగారు ముఖబింబం, బంగారు వజ్రకిరీటంతో విశేషంగా అలంకరించారు. ఉదయం 9.30 నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి కె. మమత పర్యవేక్షించారు.

సంక్షిప్తంగా..

నేడు అరసం కవితాగోష్టి

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 30: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో బుధవారం ప్రజాస్వామ్యం - ఓటరు చైతన్యం అనే అంశంపై కవితాగోష్టి జరగనుంది. బైరాగి పట్టెడలోని తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో అరసం రాష్ట్రనేత సాకం నాగరాజు అధ్యక్షతన ఉదయం 9.30 గంటలకు సభ జరుగుతుంది. సీనియర్ పాత్రికేయులు రాఘవ శర్మ, మన్నవ గంగాధర ప్రసాద్ ప్రసంగిస్తారు. అరసం పోటీల్లో బహుమతిపొందిన కవితలతో రూపొందించిన ఎన్నికల భారతం కవితా సంచికను ఆవిష్కరిస్తారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శి యువ శ్రీమురళి, నెమిలేటి కిట్టన్న నిర్వహణలో సభ జరుగుతుంది.

డాక్టరేట్ ప్రదానం



రాధ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 30: ఎస్వీయూ వైరాలజీ విభాగ పరిశోధకురాలు వై.రాధ ఇండక్షన్ ఆఫ్ సిస్టమిక్ రెసిస్టెన్స్ అగినెస్ట్ కుకుంబర్ మోజాయిక్ వైరస్ ఇన్ పంప్‌కిన్ అంశంపై ప్రొఫెసర్ చరితాదేవి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి, డాక్టరేట్ పొందినట్లు సీతః దామ్లా నాయక్ తెలిపారు. రాధ రూపొందించిన పలు పరిశోధనా వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.

'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయండి'

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 30: ఏపీల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రజలకు ఉరితాడులా మారిందన్నారు. ప్రజల ఆస్తులపై ప్రభుత్వ పెత్తనం ఏమిటని నిలదీశారు. రద్దు చేయకుంటే ప్రజలంతా ఏకతాటిపై వచ్చి తమ ఓటు ద్వారా ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారన్నారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 30: శ్రీశ్రీ జయంతి వేడుకలను వేమన విజ్ఞానవేదికలో మంగళవారం నిర్వహించారు. టీటీడీ విశ్రాంత ఏఈః తోట వెంకటేశ్వర్లు, వేమన విజ్ఞానవేదిక కార్యదర్శి మల్లారపు నాగార్జున, నడ్డినారాయణ, మునిలక్ష్మి, రఫీ, ఎస్‌డి శ్రీనివాసులు, జ్ఞానప్రసూన, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు గుండాల గోపినాథ్ రెడ్డి, కేఎస్ రాజ, శాంబోలు హరనాథ్, ధర్మయ్య, జయంతి కుమార్, సురేష్ స్వామి, విజయలక్ష్మి, రెడ్డప్ప, హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రీడింగ్‌లు తీయండి : ఈఈ

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 30: తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలో బుధవారం ఉదయం నుంచి విద్యుత్ మీటర్ రీడింగ్ తీయాలని ఈఈ కె.వాసుదేవరెడ్డి ఆదేశించారు. మంగళవారం శ్రీనివాసం ప్రాంగణంలోవున్న కొర్లగుంట సెక్షన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఏఈః మునిరామ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సివిల్స్‌పై అవగాహన కార్యక్రమం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 30: సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రెస్‌క్లబ్‌లో నిర్వాహకుడు కిరణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఉదయం 10గంటలకు భీమాస్ రెసిడెన్సీ హోటల్లో ఈ కార్యక్రమాన్ని నారాయణ ఐఏఎస్ అకాడమీ చేపట్టనుందని చెప్పారు. ఇందులో అభ్యర్థులకు అవగాహన, సందేహాల నివృత్తిని కర్ణాటక మాజీ సీఎస్ రత్నప్రభ చేస్తారని తెలిపారు. రత్నప్రభ రాసిన కలెక్టరమ్మ పుస్తకాన్ని కూడా ఆవిష్కరిస్తారన్నారు.





రోజాపై మరో రోజా పోటీ

ఇదీ మందు

నగరి ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ తరఫున రాష్ట్ర మంత్రి ఆర్‌కే రోజా పోటీ చేస్తుండగా ఇండిపెండెంట్‌గా అదే పేరుతో మరో అభ్యర్థి కే. రోజా బరిలోకి వచ్చింది. నామినేషన్ల ఘట్టం పూర్తి కావడంతో తిరుపతి రూరల్ పుదిపట్లకు చెందిన కే.రోజా పోటీ చేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించిన లిస్ట్‌లో ఉంది. దీంతో వైసీపీ వర్గాల్లో అయోమయం నెలకొంది. ఈమెకు కుట్టుమిషన్ గుర్తును ఎన్నికల సంఘం కేటాయించింది. ఇద్దరి పేరు ఒకేలా ఉండడంతో వారు తల పట్టుకుంటున్నారు. మరోవైపు టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేరు సరిపోలే విధంగా వైసీపీ నాయకులు భానుప్రకాష్ పేరున్న మరో వ్యక్తితో నామినేషన్ దాఖలు చేయించారు. అది స్ర్కూటినీలో తిరస్కారానికి గురికావడంతో వారి ప్లాన్ బెడిసికొట్టింది. అలాగే జ్ఞానప్రకాష్ పేరుతో మరో నామినేషన్ కూడా వేయించారు. ఇది సక్రమంగా ఉండడంతో ఆ అభ్యర్థి ఎన్నికల బరిలో నిలిచారు. టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కు ఒకటో నెంబర్ కేటాయించగా జ్ఞాన ప్రకాష్‌కు నాలుగవ నెంబర్ రావడంతో వైసీపీ పాచిక పారలేదనే ప్రచారం జరుగుతోంది. పేర్లతో ఓటర్లను తికమకకు గురిచేయాలనే వైసీపీ ప్రయత్నాలు ఫలించలేదు.

- పుత్తూరు అర్బన్

తిరుపతి జిల్లా ఎన్నికల బరిలో ఈసారి ప్రధాన పార్టీల తరఫున వారసులు తలపడుతున్నారు. ఏడింటా ఆరు నియోజకవర్గాల నుంచి వీరు పోటీలో నిలిచారు. నలుగురు ఈ అసెంబ్లీ ఎన్నికల నుంచే అరంగేట్రం చేస్తున్నారు. మరో ఇద్దరు మాత్రం రెండోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. తిరుపతి సిటింగ్ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఈ పర్యాయం తాను పోటీ నుంచి తప్పుకొని తనయుడు, నగర డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డికి అవకాశం కల్పించారు. అధికార వైసీపీ నుంచి ఈయన కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుతో తలపడుతున్నారు. తిరుపతి పొరుగు నియోజకవర్గం చంద్రగిరి సిటింగ్ వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఒంగోలు ఎంపీగా పోటీ చేస్తూ ఇక్కడి నుంచి తనయుడు మోహిత్‌రెడ్డిని నిలబెడుతున్నారు. మోహిత్ తొలిసారి వైసీపీ నుంచి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. నగరి నియోజకవర్గం నుంచి దివంగత మాజీ మంత్రి ముద్దు కృష్ణమనాయుడు తనయుడు భానుప్రకాష్ నిలబడుతున్నారు. తన తండ్రి మరణానంతరం 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఈయన వైసీపీ అభ్యర్థి ఆర్కే రోజా చేతిలో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈసారి కూడా భానుప్రకాష్ వైసీపీ అభ్యర్థి, మంత్రి రోజాను ఢీకొంటున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి వారసుడిగా ఆయన కుమారుడు బొజ్జల సుధీర్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా రెండోసారి తన పాత ప్రత్యర్థి,సిటింగ్ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డితో తలపడుతున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ, ఎమ్మెల్యే అయిన నెలవల సుబ్రహ్మణ్యం కుమార్తె, యువ వైద్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ పోటీ పడుతున్నారు. వెంకటగిరి నుంచి కూడా రాజకీయ వారసుడే వైసీపీ పక్షాన పోటీ చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి కుమారుడు రాంకుమార్ తొలిసారి ఎన్నికల్లో పోటీపడుతున్నారు. ఈ అరుగురు వారసుల్లో ఓటర్లు ఎవరికి పట్టం కట్టి అసెంబ్లీలో తొలిసారి అడుగుపెట్టిస్తారో చూడాల్సిందే.

- తిరుపతి(ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ బరిలో వారసులు




అభినయ్, కరుణాకరరెడ్డి
సుధీర్‌రెడ్డి, గోపాలకృష్ణారెడ్డి
మోహిత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి
విజయశ్రీ, సుబ్రహ్మణ్యం
భానుప్రకాష్, ముద్దుకృష్ణమ నాయుడు
రాంకుమార్, జనార్దనరెడ్డి

జన కేతనం

గత ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఎడాపెడా హామీలిచ్చేశారు. విజయమే లక్ష్యంగా సాధ్యాసాధ్యాలను పట్టించుకోకుండా అడగనోడిదే పాపం అన్నట్టుగా మాటిచ్చేశారు. అధికార పార్టీ తరఫున గెలిచారు కాబట్టి తమ ఎమ్మెల్యే ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతారని నియోజకవర్గ ప్రజలు నమ్మారు. గెలిచాక ప్రజలకిచ్చిన హామీలను పక్కన పెట్టేశారు. అయిదేళ్లూ ఏ మాటా నిలబెట్టుకోకుండానే గడిపేశారు. దీంతో ఎమ్మెల్యేపై ఇక్కడి ప్రజానీకం ఆగ్రహంతో ఉంది. అమలు చేయని హామీలలో ఇవికొన్ని...



సగం పనులతో ఆగిన ఇండోర్ స్టేడియం నిర్మాణం



చంద్రగిరి చెవిలో

చెవిరెడ్డి పువ్వులు

క్రీడాకారుల ఆశలతో ఆటలు

'మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రగిరి ప్రభుత్వ కళాశాలలో క్రికెట్ స్టేడియం ఏర్పాటుచేస్తాం' గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇచ్చిన హామీ ఇది.

చంద్రగిరిలో క్రికెట్ అభిమానులకు నిరాశే మిగిలింది. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హామీ కార్యరూపం దాల్చకపోవడంతో క్రికెట్ స్టేడియం ఏర్పాటు కలగానే మిగిలింది. 1936లో చంద్రగిరిలో ఏర్పాటైన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం 520 మంది చదువుతున్నారు. పక్కనే ఉన్న ఇంటర్ కళాశాలలో మరో 480 మంది చదువుతున్నారు. చంద్రగిరితో పాటు చుట్టుపక్కల గ్రామాల క్రీడాకారులకు సరైన గ్రౌండ్ లేకపోవడంతో ఇతర జిల్లాలపై ఆధారపడుతూ వచ్చారు. ఇక్కడి పాఠశాల పక్కనే ఉన్న మూడున్నరె కరాల గ్రౌండ్‌లో క్రికెట్ స్టేడియం కట్టాలని స్థానిక యువత ఎప్పటి నుంచో విజ్ఞప్తి చేస్తూ వస్తోంది.ఈక్రమంలో యువత ఓట్లకు గాలం వేయాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సంకల్పించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని మాటిచ్చారు. అధికారంలో ఉన్న ఈ ఐదేళ్లలో కనీసం ఆవైపు చూసిన సందర్భాలు కూడా లేవు.

నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణం

పాఠశాల వెనుకభాగంలోని రెండున్నర ఎకరాలలో గత టీడీపీ ప్రభుత్వం మొదలుపెట్టిన ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు కూడా నిలిచిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండలంలో ఎన్టీఆర్ క్రీడావికాస కేంద్రాల పేరుతో ఓ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని నాటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా 2018లో చంద్రగిరి ప్రభుత్వ పాఠశాల, కళాశాలకు రూ.1.8 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను ప్రారంభించింది. స్టేడియంలో 2 బాడ్మింటన్ కోర్టులు, కోచ్‌రూం, జిమ్‌రూం, టాయిలెట్స్, డార్మిటరీలకు ప్లాన్ సిద్ధం చేశారు. ఇక టోర్నమెంట్లకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని చంద్రగిరి క్రీడాకారులతో పాటు పాకాల, ఎర్రవారిపాలెం, చిన్నగొట్టిగల్లు, రామచంద్రాపురం, తిరుపతిరూరల్ యువత సంబరపడ్డారు. ఇంతలో వైసీపీ ప్రభుత్వం వచ్చింది. నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం వహించింది. సంబంధిత కాంట్రాక్టర్ అప్పటికే రూ.కోటితో దాదాపు సగం పనులు పూర్తిచేశారు. నిధుల విషయంలో కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చింది. పనులను మధ్యలో వదిలేశారు. దీంతో ఇండోర్ స్టేడియం కూడా ఏర్పాటు కాలేదని క్రీడాకారులు వాపోతున్నారు.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

కందకమూ.. ఎక్కడా ?

● రైతన్నలకు తప్పని ఏనుగుల బెడద



ఏనుగుల సంచారంతో నాశనమైన మామిడి చెట్లు

వ్యవసాయ భూములను ఏనుగులు ధ్వంసం చేయకుండా కందకాలు ఏర్పాటు చేస్తామన్న హామీ నెరవేరలేదు. రైతులకు ఏనుగుల తలనొప్పి ఇప్పటికీ తగ్గలేదు. అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే చెవిరెడ్డి కందకాల మాటే ఎత్తలేదంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి, రేణిగుంట సమీపంలోని మండల్లోని పంచాయితీలు చాలా వరకు శేషాచల అడవులకు సమీపంలో ఉన్నాయి. దాదాపు 15 వేల ఎకరాలకుపైగానే పొలాలు అడవికి దగ్గరగా ఉన్నాయి. సమీపంలోని గ్రామ రైతులు మామిడి, వరి, టమోట, కొబ్బరిచెట్లు పెంపకంపై ఆధారపడుతుంటారు. అడవికి సమీపంలో పొలాల్లో నిత్యం ఏనుగులు గుంపు సంచరిస్తుండటంతో పంటలు నాశనమవుతున్నాయి. పంట నష్టంతో పాటు ప్రాణనష్టం, ఏనుగుల దాడిలో గాయపడిన వారి సంఖ్య కూడా అధికమే. దాదాపు 20 నుంచి 25 ఏళ్ల పాటు పెంచిన మామిడిచెట్లను కూడా భారీగా నష్టపోయిన సందర్భాలున్నాయి. తమ సమస్యను పరిష్కరించాలంటూ ఏన్నోఏళ్లుగా రైతులు ప్రభుత్వానికి విన్నవించుకుంటూనే ఉన్నారు. ఈక్రమంలో గతంలో పాదయాత్ర సందర్భంగా జగన్‌తో పాటు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కందకాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చెవిరెడ్డి అటుగా వెళ్లి చూడటం కానీ, కనీసం ఈ అంశంపై చర్చించిన పాపాన పోలేదని రైతులు విమర్శిస్తున్నారు

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

మురుగులో కొట్టుకుపోయిన హామీ

చంద్రగిరికి భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు హామీకే పరిమితమయ్యింది. తాను మళ్లీ గెలిచిన వెంటనే చంద్రగిరి మేజర్ పంచాయతీకి అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్‌ను ఏర్పాటు చేస్తానని గత ఎన్నికల సమయంలో వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇచ్చిన హామీ అటకెక్కింది. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఈఅంశంపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. చంద్రగిరి పంచాయతీలో దాదాపు 26 వేల జనాభా నివసిస్తున్నారు. సరైన డ్రైనేజ్ వ్యవస్థ లేక మురుగునీటి సమస్య ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. స్థానికుల ఇళ్ల వద్ద, కాలనీల్లో ఏర్పాటు చేసుకున్న కాలువల ద్వారా డ్రైనేజ్ నీరు ప్రవహిస్తోంది. కొన్ని చోట్ల చెట్లు, రాళ్లు, మట్టిపెళ్లలతో ఈడ్రైనేజ్ నీరు ముందుకు వెళ్లలేక నిలిచిపోతోంది. కాలువలను శుభ్రపరిచిన సందర్భాల్లో మురుగు వెంకటంపేట, నూకలగుంట వంటి ప్రాంతాలలో ఆగిపోతోంది. వర్షం కురిస్తే మురుగు వర్షపునీటితో కలిసిపోయి ఇళ్లమధ్యలోనే ప్రవహిస్తోంది. 2019 ఎన్నికల సమయంలో చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సందర్శించి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విజయనగర్ కాలనీలో భూగర్భడ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈవిషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనను మళ్లీ గెలిపిస్తే విజయనగర్ కాలనీ మాత్రమే కాకుండా చంద్రగిరి మేజర్ పంచాయతీ మొత్తానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్‌ను ఏర్పాటు చేస్తామని ప్రజలను నమ్మించారు. అధికారంలోకి వచ్చిన చెవిరెడ్డి ఆ తర్వాత ఆ మాటే ఎత్తలేదు. పలుమార్లు స్థానిక ప్రజలు డ్రైనేజ్ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళితే 'చూస్తాం, చేస్తాం' అనే మాటలకే పరిమితమయ్యారు.

- తిరుపతి (ఆంధ్రజ్యోతి)



వెంకటంపేటలో అస్తవ్యస్థంగా ఉన్న డ్రైనేజ్ కాలువలు



రాయలచెరువు...

చెరువుకట్ట దాటని మాట


● మరమ్మతులకు నోచుకోని రాయలచెరువు

జిల్లాలో అతిపెద్దదైన రాయలచెరువు కట్ట అభివృద్ధి చేస్తానన్న ఎమ్మెల్యే మాట నీటిమూటే అయిందంటున్నారు ఇక్కడి ప్రజానీకం. 2021 నవంబరులో భారీ వర్షాలకు చెరువు కట్ట కొంతమేర కుంగింది. చెరువు తెగుతుందేమోనని కట్టకింద ఉన్న 20 గ్రామాల ప్రజలు ప్రాణాలు అరచేత పట్టుకుని తలో దిక్కూ పారిపోయారు. నాటి జల ప్రళయానికి సుమారు 17 రోజుల పాటు ప్రజలు ఆర్‌సీపురం మండల కేంద్రానికి చేరుకోలేకపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి కట్టకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి మమ అనిపించారు. ఇలాంటి పరిస్థితి మరోసారి ఎదురు కాకుండా రాయలచెరువు కట్టను రూ.8 కోట్లతో పటిష్ట పరచి ప్రజల ఇబ్బందులను తొలగిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి కూడా నిధులు కోసం ప్రతిపాదనలు పంపారు. మూడేళ్లు గడుస్తున్నా ఆ ఊసే లేదు. చెరువు కట్టను పూర్తిగా ముళ్లపొదలు కమ్మేశాయి. రాయలచెరువు ఒకసారి నిండితే ఐదేళ్ల పాటు ఆర్‌సీపురం మండల ప్రజలకు సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఇలాంటి చెరువును తమ ఎమ్మెల్యే పట్టించుకోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

- రామచంద్రాపురం

సూళ్లూరుపేట చరిత్ర

విశిష్టతల కోట



ఆసియాలోనే అతిపెద్ద పులికాట్ ఉప్పునీటి సరస్సు.. అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనాకేంద్రం షార్.. దేశవిదేశాలకు చెందిన పక్షుల విడిది నేలపట్టు ..పేరెన్నికగన్న పరిశ్రమలు కొలువుదీరిన శ్రీసిటీ సెజ్...ఇలా ఎన్నో విశేషాల సమాహారం సూళ్లూరుపేట నియోజకవర్గం. 13 సార్లు నియోజకవర్గంలో ఎన్నికలు జరగగా, కాంగ్రెస్, టీడీపీలు చెరో ఐదేసిసార్లు విజయం సాధించాయి. వైసీపీ రెండుసార్లు గెలిచింది. ఈ నియోజకవర్గం ఏర్పడ్డాక మహిళలెవరూ ప్రాతినిధ్యం వహించలేదు. రెండుసార్లు పోటీ చేసినా గెలవలేదు. పసల పెంచలయ్య, పరసా వెంకటరత్నంలు మాత్రమే మంత్రులుగా పనిచేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండే ఈ నియోజకవర్గంలో టీడీపీ ఆవిర్భావం తరువాత పరిస్థితి మారిపోయింది. టీడీపీ ఆదిపత్యం సాగింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో మొదటి ఎన్నికల్లో ప్రస్తుత సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాలు వెంకటగిరి నియోజకవర్గంలో కలసి ఉండేవి. 1962 నియోజకవర్గాల పునర్ విభజనతో సూళ్లూరుపేట విడిగా నియోజకవర్గంగా ఏర్పడింది.

-తడ

నియోజకవర్గం ఏర్పడింది: 1962
ఎన్నిసార్లు ఎన్నిక జరిగింది: 13
నియోజకవర్గం పరిధిలోని మండలాలు : సూళ్లూరుపేట, నాయుడుపేట, తడ, దొరవారిసత్రం, పెళ్లకూరు,ఓజిలి

ఎమ్మెల్యేలు

1962	పసుపులేటి సిద్దయ్యనాయుడు	కాంగ్రెస్
1967	పిట్ల వెంకటసుబ్బయ్య	ఇండిపెండెంట్
1972	పిట్ల వెంకటసుబ్బయ్య	కాంగ్రెస్
1978	పిట్ల వెంకటసుబ్బయ్య	కాంగ్రెస్
1983	సట్టి ప్రకాశం	టీడీపీ
1985	మదనంబేటి మణెయ్య	టీడీపీ
1989	పసల పెంచలయ్య	కాంగ్రెస్
1994	పరసా వెంకటరత్నం	టీడీపీ
1999	పరసా వెంకటరత్నం	టీడీపీ
2004	నెలవల సుబ్రహ్మణ్యం	కాంగ్రెస్
2009	పరసా వెంకటరత్నం	టీడీపీ
2014	కిలివేటి సంజీవయ్య	వైసీపీ
2019	కిలివేటి సంజీవయ్య	వైసీపీ

ఓటర్లు
మొత్తం : 2,41,124
పురుషులు: 1,17,367
మహిళలు 1,23,733
ఇతరులు : 24

రాష్ట్రం కోసం రాజకీయ ప్రచారం

శ్రీకాళహస్తిలో సందడి చేస్తున్న పల్లమాల సుధాకర్



'మొగలిరేకులు', 'చక్రవాకం' అనే పేర్లు వినగానే పల్లమాల సుధాకర్, మంజులా నాయుడు గుర్తుకువస్తారు. తెలుగు టీవీ సీరియల్స్‌లో ట్రెండ్ సెట్టర్స్‌గా ఈ దంపతులకు ప్రత్యేక స్థానం ఉంది. పాపానాయుడుపేటలోనే మొగిలిరేకులు కి శ్రీకారం చుట్టారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన పల్లమాల సుధాకర్ కొద్ది రోజులుగా ప్రచారంలో కనిపిస్తున్నారు. టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి విజయం కోసం తమ బంధుమిత్రులందరినీ సమీకరిస్తున్నారు. ప్రతి రోజూ వివిధ వర్గాలతో మంతనాల్లో బిజీగా ఉంటున్నారు. హైదరాబాద్‌లో స్థిరపడిన వీరు మొత్తం కుటుంబం అంతా ఎన్నికల కోసమే 20 రోజుల కిందట శ్రీకాళహస్తికి వచ్చేశారు. ఎందుకిలా అనడిగితే పల్లమాల సుధాకర్ ఇలా చెబుతున్నారు.. "ప్రస్తుతం రాష్ట్రంలో చోటు చేసుకున్న పరిణామాలు ఎంతో బాధ కలిగించాయి. విలువలు గాడి తప్పాయి. అభివృద్ధి కనుమరుగైపోయింది. భావితరాల భవిష్యత్తుపై అంధకారం అలముకుంది.. కొత్తగా వచ్చే భూచట్టం పేరు వింటేనే రైతులు వణికి పోతున్నారు. ఇలాంటి దారుణ పరిస్థితులపై సామాజిక స్పృహతో స్పందించాలనిపించింది. రామాయణంలో ఉడుత సహాయం గుర్తుకు వచ్చింది. సమాజంలో మంచిని బతికించుకోవడం కోసమే ఈ ప్రయత్నం చేస్తున్నాను. పవన్‌కళ్యాణ్ ఆశయాలు నన్ను బాగా ఆకట్టుకున్నాయి. రాష్ట్రం తిరిగి గాడిలోపడాలంటే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. శ్రీకాళహస్తి ప్రాంతానికి దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఎంతో సేవ చేశారు. ఆయన కుమారుడి విజయం కోసం పనిచేసి గోపాలన్న రుణం తీర్చుకోవాలనుకున్నాను. ఈ ప్రాంతంలో నా ఆత్మీయులు అసంఖ్యాకంగా ఉన్నారు. వారందరినీ చైతన్యపరుస్తున్నాను." పల్లమాల సుధాకర్ 2009లో శ్రీకాళహస్తి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేశారు కూడా. ప్రజారాజ్యం లోనూ చురుగ్గా వ్యవహరించారు.

- శ్రీకాళహస్తి



వలంటీరు కష్టాలు

రాజీనామా చేసి ప్రచారానికి రావాలని వైసీపీ కౌన్సిలర్ ఒత్తిడి

ఒప్పుకోకపోవడంతో ఇంటికెళ్లి ఘర్షణ

చిత్తూరు జిల్లా వ్యాప్తంగా వలంటీర్లతో రాజీనామాలు చేయించి మరీ వైసీపీ నాయకులు ప్రచారంలో తిప్పుకుంటున్న విషయం తెలిసిందే. ప్రచారానికి రానివాళ్ల మీద ఒత్తిడి చేస్తున్న ఘటనలూ బయటపడుతున్నాయి. తాజాగా పలమనేరు పట్టణంలో ఓ వైసీపీ కౌన్సిలర్ మహిళా వలంటీర్‌పై ఒత్తిడి చేసి, ఆమె ఒప్పుకోకపోవడంతో దాడికి యత్నించాడు. వివరాల్లోకి వెళితే.. పలమనేరు మున్సిపాలిటీకి చెందిన వైసీపీ కౌన్సిలర్ హైదర్ స్థానికంగా ఓ మహిళా వలంటీర్‌ను ప్రచారానికి రావాలని కొంత కాలంగా ఒత్తిడి చేస్తున్నాడు. ఆమె దానికి ఒప్పుకోకపోవడంతో బెదిరింపులకు దిగారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అనుచరులతో వెళ్లిన కౌన్సిలర్ రాజీనామా చేసి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని పట్టుబట్టాడు. ఒకటో తేదీలోగా రాజీనామా చేయకపోతే అంతు చూస్తానని బెదిరించినట్లు ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా, పలమనేరులో వలంటీర్లను బలవంతంగా రాజీనామా చేసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనేలా చేస్తున్నారని, అలాంటి వారిపై ఎన్నికల అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఇదీ సంగతి



వైసీపీలో గాజు గ్లాసు ఆశ



అనుకున్నట్లే అయింది. కుప్పంలోనూ స్వతంత్ర అభ్యర్థికి జనసేన పార్టీ గుర్తు అయిన గాజు గ్లాసు సింబల్ కేటాయింపు జరిగిపోయింది. ఎన్నికల నిబంధనల ప్రకారం ఇది సరియైనదే అయినా నైతికంగా మాత్రం తప్పుడు చర్య అని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. వైసీపీ రెబల్‌గా మారి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న మొరసనపల్లె అధికార పార్టీ సర్పంచి జగదీశ్ భార్య నీలమ్మకు ఈ గాజు గ్లాసు గుర్తు కేటాయించారు. ఇప్పుడీ గాజు గ్లాసుపైన వైసీపీ 'దింపుడుకళ్లం ఆశ'లు పెట్టుకుంటోంది. 'వైనాట్ కుప్పం' అని వైసీపీ అధినేత జగన్ చెప్పాక.. కుప్పంలో చాలా పరిణామాలు చోటు చేసుకున్నాయి. క్షేత్రస్థాయిలో అధికార పార్టీ గ్రామ స్థాయి నాయకులు సహాయ నిరాకరణ మూడ్‌లోకి వెళ్లిపోయారు. దీంతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుజ్జగింపులు.. ఈ మధ్య జరిగిన ఒక సమావేశంలో ప్రజాప్రతినిధులపై భరత్ తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేయడం వంటి పరిణామాలు ఆ పార్టీ రాబట్టగలిగే ఓట్లెంతో ఒక అంచనాకు వచ్చేశారు అందరూ. కనీసం గౌరవప్రదమైన ఓట్లతో బయటపడితే చాలన్న ఆలోచన పార్టీలో మొదలైపోయిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మొదలైన 'గాజు గ్లాసు' ఆలోచనలు చివరకు వైసీపీ రెబల్ అయిన స్వతంత్ర అభ్యర్థి నీలమ్మకు ఆ గుర్తు కేటాయింపు జరిగింది. ఎంతోకొంత నీలమ్మ చీల్చగలిగిన ఓట్లను వైసీపీవి కాక టీడీపీవి అయ్యేలా గట్టి ప్రయత్నాలే సాగుతున్నాయి. కూటమి పార్టీలలో ఒకటైన జనసేన గుర్తు కాబట్టి, సైకిల్‌పై పడాల్సిన ఓట్లు గాజు గ్లాసుపై పడాలని వైసీపీ నాయకులు కోరుకుంటున్నారు. కానీ టీడీపీ అధినేత చంద్రబాబే అభ్యర్థిగా ఉన్న కుప్పంలో వైసీపీ ఆటలు చెల్లేలా మాత్రం కనిపించడంలేదు. ఇక, నగరి అసెంబ్లీ, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలోనూ స్వతంత్ర అభ్యర్థులకు 'గాజు గ్లాసు' గుర్తు కేటాయించారు. ఇదంతా ప్లాన్ ప్రకారం జరిగిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

- కుప్పం

జన కేతనం

www.andhrajyothy.com

బుధవారం 1 మే 2024

రాజంపేట లోక్‌సభ బరిలో పెద్దిరెడ్డి, నల్లారి కుటుంబాలు

వాళ్లు.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు దశాబ్దాలుగా రాజకీయ బద్ధ శత్రువులు. పదేళ్ల ముందర వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నప్పటికీ ప్రత్యర్థులే. పక్క నియోజకవర్గాలైనా.. రాజకీయ వైరం కొనసాగింది. అలాంటి నల్లారి.. పెద్దిరెడ్డి కుటుంబాలు ఈ ఎన్నికల్లో తొలిసారి తలపడుతున్నాయి. రాజంపేట లోక్‌సభ బీజేపీ కూటమి నుంచి మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, వైసీపీ తరపున పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి బరిలో ఉన్నారు. పరస్పర తీవ్ర విమర్శలతో రాజకీయాలూ హీటెక్కుతున్నాయి.



పాత ప్రత్యర్థుల

తొలి ఫైట్



తొలిసారి నేరుగా పోటీ

నాడు ఒకే పార్టీలో ప్రత్యర్థి కుటుంబాలు. నేడు వేర్వేరు పార్టీల అభ్యర్థులుగా రాజంపేట లోక్‌సభకు పోటీపడుతున్నారు. ఎంపీ స్థానానికి కిరణ్ తొలిసారిగా.. మిథున్‌రెడ్డి మూడోసారి బరిలోకి దిగారు. జగన్‌ను 16 నెలలు జైలులో పెట్టారని, సీఎంగా ఆయన అభివృద్ధి చేయలేదంటూ పెద్దిరెడ్డి వ్యక్తిగతంగా దూషిస్తూ ప్రచారం సాగిస్తున్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా ప్రచారంలో దీటుగా ముందుకు సాగుతున్నారు. ఈయన తరపున ఇప్పటికే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రచారంలో పాల్గొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కూడా ప్రచారానికి రానున్నారు.

- పుంగనూరు

ఉమ్మడి చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉన్నప్పటి నుంచీ ఆయనకు, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి మధ్య రాజకీయ ఆధిపత్య పోరు కొనసాగుతోంది. ఒకే పార్టీలో ఉన్నా వీరిమధ్య సయోధ్య మాటేలేదు. కలికిరిలో కిరణ్‌కుమార్‌రెడ్డి చిన్నాన్న నల్లారి తిమ్మారెడ్డి మిషన్ వద్ద సారా నిల్వ విషయంగా పెద్దిరెడ్డి సోదరుడు భాస్కర్‌రెడ్డి గొడవ చేయడంతో వివాదాలు మరింత పెరిగాయి. పూర్వపు వాయల్పాడు నియోజకవర్గం కలికిరి మండలం మేడికుర్తి ప్రాజెక్టు నిర్మాణ టెండర్ పెద్దిరెడ్డి వేయరాదని నల్లారి కిరణ్ ప్రయత్నించగా.. చివరి నిమిషంలో పీఎల్ఆర్ కంపెనీ టెండర్ వేసి పని దక్కించుకుంది. గతంలో తన అనుచరుడైన సుధాకర్ గౌడ్ భార్య, గుర్రంకొండ జడ్పీటీసీ సభ్యురాలు మంజులను జడ్పీ ఛైర్‌పర్సన్ చేయాలని కిరణ్ భావించగా.. బైరెడ్డిపల్లె జడ్పీటీసీ సభ్యురాలు ఎం.రెడ్డెమ్మకు ఆ పదవి ఇవ్వాలని పెద్దిరెడ్డి పట్టుపట్టారు. నాటి పీసీసీ అధ్యక్షుడు సత్యనారాయణరావు పంచాయితీ చేసి చివరకు రెడ్డెమ్మకు పదవి ఇచ్చారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి రాగా.. కిరణ్‌కుమార్‌రెడ్డికి మంత్రి పదవి దక్కుతుందని అందరూ భావించారు. కానీ, మంత్రి పదవి రాకుండా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తీవ్రంగా అడ్డుకున్నట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. దీంతో కిరణ్‌కు ప్రభుత్వ చీఫ్‌విప్ పదవి వరించింది. 2009లోనూ కిరణ్‌కు మంత్రి పదవి రాకుండా అడ్డుపడి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంత్రి అయ్యారు. కిరణ్‌కు అసెంబ్లీ స్పీకర్ పదవి దక్కింది. వైఎస్ మృతితో రోశయ్య తర్వాత సీఎం అవకాశం కిరణ్‌కుమార్‌రెడ్డికి వచ్చింది. వైఎస్ క్యాబినెట్‌లోని పెద్దిరెడ్డి తప్ప మిగిలిన అందరినీ ఆయన మంత్రులుగా కొనసాగించారు. ఇలా రెండు కుటుంబాలు, వర్గాల మధ్య కొనసాగిన రాజకీయ కక్షలు, విభేదాలు తీవ్రస్థాయికి చేరాయి. గతంలో పీలేరు నియోజకవర్గంలో కిరణ్‌కు వ్యతిరేకంగా పెద్దిరెడ్డి వర్గం.. పుంగనూరులో పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా నల్లారి వర్గం ఎన్నికల్లో పనిచేశాయి. ఒకే పార్టీలో ఉన్నప్పటికీ రాజకీయ ఆధిపత్య పోరు కొనసాగింది.

రెండు కుటుంబాల రాజకీయ నేపథ్యం

● కలికిరి మండలం నగరిపల్లెకి చెందిన మాజీ మంత్రి నల్లారి అమరనాథరెడ్డి మృతితో ఆయన భార్య సరోజమ్మ పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తర్వాత ఎన్నికల్లో కిరణ్‌కుమార్‌రెడ్డి 1989 నుంచి 2009 వరకు వాయల్పాడు, నియోజకవర్గ పునర్విభజనలో పీలేరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. ప్రభుత్వ చీఫ్ విప్, స్పీకర్, ముఖ్యమంత్రిగా పనిచేశారు. రాష్ట్ర విభజనతో కాంగ్రెస్‌ను వీడి జైసమైక్యాంధ్ర పార్టీ పెట్టారు. ఆ ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. కొంతకాలం తర్వాత కాంగ్రెస్‌లో... అనంతరం బీజేపీలో చేరారు. ప్రస్తుతం రాజంపేట ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ● సదుం మండలం ఎర్రాతివారిపల్లెకు చెందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాంగ్రెస్ నుంచి 1989లో పీలేరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇలా కిరణ్, పెద్దిరెడ్డి ఒకేసారి ఎమ్మెల్యేలు అయ్యారు. నియోజకవర్గ పునర్విభజనతో పీలేరు నుంచి పుంగనూరుకు వచ్చి ఒకసారి కాంగ్రెస్, రెండుమార్లు వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య క్యాబినెట్‌లో కొంతకాలం.. ప్రస్తుతం జగన్ మంత్రివర్గంలోనూ ఉన్నారు. ఈయన కుమారుడు మిథున్‌రెడ్డి 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ తరఫున రాజంపేట లోక్‌సభకు పోటీచేసి గెలుపొందారు.

పరస్పరం 'కాళ్ల బేరాల' ఆరోపణలు

- అడ్డదారిలో సీఎం కావడానికి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నాటి కేంద్రమంత్రి చిదంబరం కాళ్లుపట్టుకున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పలుమార్లు ఆరోపణలు చేశారు.
- గతంలో డీసీసీ అధ్యక్ష పదవికి అడ్డుపడకుండా మద్దతు ఇవ్వాలని తిరుపతిలో రాత్రి ఒక్కసారి, మరుసటి రోజు ఉదయం మరోసారి పెద్దిరెడ్డి తన కాళ్లు పట్టుకున్నారని కిరణ్‌కుమార్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఇది నిజమని.. తాను కాణిపాకం, తరిగొండలో ప్రమాణం చేయడానికి సిద్ధమని సవాల్ విసిరారు. తన తండ్రికాలం నుంచి వ్యక్తిత్వాన్ని విడవలేదని, తాను ఎవరి కాళ్లు పట్టుకోలేదని స్పష్టంచేశారు.
- 'సత్యసాయిబాబా మృతితో టన్నులు టన్నుల బంగారాన్ని లారీల్లో తరలించి చిదంబరం, కిరణ్‌కుమార్‌రెడ్డి దోచుకున్నారని పెద్దిరెడ్డి చేసిన ఆరోపణలు నిరాధారం. అయ్యప్పస్వామి గుడిలో ఆయన ప్రమాణం చేయాలి' అంటూ కిరణ్ మరోసారి సవాల్ విసిరారు.
- తాను సోనియాగాంధీ కాళ్లే పట్టుకోలేదని, కిరణ్ కాళ్లు పట్టుకోవాల్సిన దుర్గతి పట్టలేదని, మిథున్ చేతిలో ఓడిపోవడం ఖాయమని ఎన్నికల ప్రచారాల్లో పెద్దిరెడ్డి చెబుతున్నారు.
- ఇలా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మళ్లీ రాజకీయాల్లోకి వచ్చి పెద్దిరెడ్డిపై తీవ్రవిమర్శలు చేయడం, కాళ్లు పట్టుకున్నారన్న ఆరోపణలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.
- కిరణ్ గెలిస్తే కేంద్ర మంత్రి అవుతారని, రాజంపేట పార్లమెంటు అభివృద్ధి చెందుతుందని, పెద్దిరెడ్డిని నిలవరించే వ్యక్తి వచ్చారని కూటమి పార్టీలు ప్రచారం చేస్తున్నాయి.

ఎన్నికల బరిలో తండ్రీ కొడుకులు, అన్నదమ్ములు




రాజంపేట లోక్‌సభకు వైసీపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పోటీ చేస్తుండగా, ఇదే నియోజకవర్గ పరిధిలోని పుంగనూరులో ఆయన తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. తంబళ్లపల్లెలో ఆయన చిన్నాన్న ద్వారకనాథరెడ్డి పోటీ చేస్తున్నారు.

రాజంపేట లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇదే నియోజకవర్గ పరిధిలోని పీలేరులో టీడీపీ అభ్యర్థిగా ఆయన సోదరుడు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి బరిలో ఉన్నారు.





● గుర్తుంచుకో

మీ ఓటూ ముఖ్యమే

ఓటు విలువ తెలియజేసేలా అధికార యంత్రాంగం నెల రోజులుగా ప్రచార చర్యలు చేపట్టింది. వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. 'మీ ఓటూ ముఖ్యమే', ప్రజాస్వామ్యం నీతోనే మొదలవుతుంది' తదితర నినాదాలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తోంది. చిత్తూరులోని పలు కూడళ్లు.. జనసందడి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ తరహా బోర్డులను పెడుతున్నారు. ఇంకా '2024 లోక్‌సభ, శాసన సభ ఎన్నికల్లో ఓటు వేయడం మన హక్కు,యువత మేల్కొనండి, చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం కోసం తప్పనిసరిగా ఓటు వినియోగించుకోండి' అంటూ ఓటు ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. ఈ ప్రచార బోర్డులు ఓటర్లను ఆకర్షిస్తున్నాయి.

- చిత్తూరు

సిద్దేశ్వరుడిని దర్శించుకున్నాకే ప్రచారం



● సెంటిమెంట్

ఎన్నికలు ఏ స్థాయివైనా సరే.. సిద్దేశ్వరుడిని దర్శించుకున్నాక, ఆ గ్రామం నుంచే ప్రచారం మొదలు పెడతారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఈ సెంటిమెంట్‌ను పాటిస్తున్నారు. జీడీనెల్లూరు మండలం వింజం పంచాయతీలోని సిద్దేశ్వరకొండ గ్రామంలో సిద్దేశ్వరస్వామి ఆలయం ఉంది. వేపంజేరి నియోజకవర్గంగా ఉన్నపుడే మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ ఈ సెంటిమెంట్‌ను కొనసాగించారు. ఐదుసార్లు గెలవడం, మంత్రి, డిప్యూటీ స్పీకరు పదవులు పొందడంతో ఈ సెంటిమెంట్ బలంగా మారింది. జీడీనెల్లూరు నియోజకవర్గం ఆవిర్భవించిన తర్వాతా దీనిని పాటిస్తున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా కళత్తూరు నారాయణస్వామి కూడా ఈ ఆలయంలోనే పూజలుచేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇప్పుడూ టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్, వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మీ కూడా వేర్వేరు రోజుల్లో ఈ ఆలయంలోనే పూజలు చేసి.. ఇక్కడే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచి ఎన్నికల్లోనూ పోటీచేసే అభ్యర్థులు సెంటిమెంట్‌గా సిద్దేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేసి మొక్కుకున్నా.. ఈ గ్రామంలోనే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మరిప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సెంటిమెంట్ ఎవరికి వర్కవుట్ అవుతుందో చూడాలి.

- గంగాధరనెల్లూరు

144 సెక్షన్ ఎందుకు విధిస్తారు?

● మీకు తెలుసా..?

ఎన్నికలు, అల్లర్లు జరిగేటప్పుడు, పరీక్షల నిర్వహణ సమయంలో ఎక్కువగా 144 సెక్షన్ విధిస్తుంటారు. అసలు 144 సెక్షన్ అంటే ఏమిటి, ఎందుకు, ఎప్పుడు విధిస్తారో తెలుసుకుందాం. సీఆర్‌పీసీ 144 సెక్షన్ కింద ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లకు విస్తృత అధికారాలు కల్పించారు. ప్రధానంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిన సమయంలో పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఈ సెక్షన్ అమలు చేస్తారు. సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తారు. ఈ సెక్షన్ అమల్లోకి వస్తే నలుగురు, ఐదుగురు వ్యక్తులకు మించి గుమిగూడకూడదు. కలిసి తిరగడంపైనా నిషాధాజ్ఞలు ఉంటాయి. ఎన్నికల సమయంలో నామినేషన్ల ప్రక్రియ నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఈ సెక్షన్ అమల్లో ఉంటుంది. ఆ సమయంలో ప్రదర్శనలు, ఊరేగింపులు, ర్యాలీలు చేయకూడదు. ప్రధానంగా రెండు పార్టీలు, గ్రూపుల మధ్య తగాదాలు తలెత్తినప్పుడు కూడా విధిస్తారు. రెండు నెలల వరకు కలెక్టర్, ప్రభుత్వం నియమించిన మెజిస్ట్రేట్, పోలీసులు మ్యాన్యువల్ ప్రకారం ఎస్పీలు ఈ సెక్షన్‌ను అమలు చేస్తారు.


- చిత్తూరు

ఆమె ఆశీర్వాదం ఉంటేనే..!

- అభ్యర్థుల గెలుపులో మహిళా ఓటర్లే కీలకం
- పురుషులకంటే 23,528 మంది ఎక్కువ

ఎవరు గెలవాలన్నా 'ఆమె' ఆశీర్వాదం ఉండాల్సిందే. అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ఇక, పోలింగ్ రోజున వీరి ఓటింగ్ శాతమే అధికం. ఈ పరిణామాలతో అభ్యర్థుల గెలుపునకు మహిళా ఓటర్లు కీలకంగా మారారు. రెండు దశాబ్దాలుగానూ వీరి తీర్పే ఓటర్ల గెలుపు రాతను నిర్దేశిస్తోంది.

- చిత్తూరు కలెక్టరేట్



జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక లోక్‌సభ సెగ్మెంట్‌లో అభ్యర్థుల గెలుపునకు మహిళా ఓటర్లే కీలకంగా మారారు. జిల్లా ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ మంగళవారం విడుదల చేశారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 15,63,911 మంది ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 7,70,154, మహిళా ఓటర్లు 7,93,682 మంది, థర్డ్ జెండర్ 75 మంది ఉన్నారు. పురుషులకంటే 23,528 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉండడం విశేషం. చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, కుప్పం, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, నగరి నియోజకవర్గాల్లో పురుష ఓటర్లకంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల్లో గెలుపుకోసం మహిళా ఓటర్లను ఆకర్షించేలా మ్యానిఫెస్టోలో ప్రత్యేక పథకాలు ప్రకటించాయి. సరికొత్త పథకాలతో మహిళా ఓటర్లను ఆకర్షించే పనిలో తలమునకలయ్యాయి. ఏదిఏమైనా జిల్లాలో రానున్న ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించేది మహిళా ఓటర్లేనని విశ్లేషకులు చెబుతున్నారు. మరి వీరంతా ఎవరిని ఆశీర్వదిస్తారో చూడాలి. రెండు దశాబ్దాలుగానూ మహిళా ఓటర్ల తీర్పే అభ్యర్థుల విజయావకాశాలను నిర్ణయిస్తోంది. వీరు ఎక్కువగా ఉండటం, గంపగుత్తగా ఓట్లు వేయడం వల్ల వీరి ప్రభావం అధికంగా ఉంది.

నియోజకవర్గం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
పుంగనూరు	1,17,072	1,21,791	05	2,38,868
నగరి	98,537	1,04,029	08	2,02,574
జీడీనెల్లూరు	1,01,853	1,03,090	06	2,04,949
చిత్తూరు	98,718	1,04,101	31	2,02,850
పూతలపట్టు	1,08,811	1,12,181	07	2,20,999
పలమనేరు	1,32,653	1,35,243	00	2,67,896
కుప్పం	1,12,510	1,13,247	18	2,25,775
మొత్తం	7,70,154	7,93,682	75	15,63,911

ఐఐటీ, ఐసర్‌లలో జర్మన్ బృందం



ఏర్పేడు, ఏప్రిల్ 30: తిరుపతి ఐఐటీ, ఐసర్‌ను జర్మనీ ప్రతినిధుల బృందం మంగళవారం సందర్శించింది. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య జర్మనీ ప్రతినిధుల బృందానికి స్వాగతం పలికారు. హైదేల్ బర్గ్ యూనివర్శిటీ ఆఫ్ కొలోన్ ప్రతినిధులు ఐఐటీలో ఇప్పటి వరకు నెలకొల్పిన విద్యార్థులకు సంబంధించి వసతిగృహాలు, కళాశాల భవనాలు, లేబొరేటరీలను సందర్శించారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ భారత్, జర్మనీ మధ్య బలమైన సహకారానికి భారీ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. రెండు దేశాల విద్యార్థులు, పరిశోధకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు.

ఎన్డీఏ కూటమిని గెలిపించండి



లక్ష్మీపురంలో ప్రచారం చేస్తున్న కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 30: వరదయ్యపాళెం మండలం కువ్వాకొల్లి పంచాయతీలోని లక్ష్మీపురం గ్రామంలో ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం మంగళవారం ప్రచారం చేశారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వరప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, నిర్మల్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఇక ఎమ్మార్పీఎస్ నాయకులు మండలంలోని కళత్తూరు, సంతవేలూరు, మావిళ్లపాడు, అంబూరు గ్రామాల్లో పర్యటించి ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దొరబాబు మాదిగ, సుధాకర్, చిన్న రాఘవయ్య, లక్ష్మయ్య, వెంకయ్య, హేమాద్రి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

తొట్టంబేడు, ఏప్రిల్ 30: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు అన్నారు. మండలంలోని పొయ్య పంచాయతీలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలకాల గురించి ప్రజలకు వివరించారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మురళీ నాయుడు, మునిరాజనాయుడు, ఎస్సీవీ కిరణ్ నాయుడు, హరినాయుడు, నారాయణయాదవ్, రాఘవులుయాదవ్, సుదాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుధీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించండి



రాజులకండ్రిగలో సమావేశమైన టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 30: త్వరలో జరిగే ఎన్నికల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ పేరం ధనంజయులు నాయుడు పిలుపునిచ్చారు. ఏర్పేడు మండలం మడిబాక పంచాయతీ రాజులకండ్రిగలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాలకృష్ణారెడ్డి హయాంలోనే శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందినట్లు గుర్తు చేశారు. ఏర్పేడు మండలాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేశారని చెప్పారు. నియోజకవర్గం మరింతగా అభివృద్ధి చెందాలంటే బొజ్జల సుధీర్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లికార్జున నాయుడు, హరినాయుడు, రవినాయుడు, శ్రీనివాసులరాజు, శంకర్‌రాజు, సాంబశివరాజు, నాగరాజునాయుడు, సుబ్రహ్మణ్యంరాజు, మునిరాజా యాదవ్, నాగరాజునాయుడు, చిరంజీవీ నాయుడు, కేశినేని సుబ్రహ్మణ్యం, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్ర యాదవ్‌పై దాడి సిగ్గుచేటు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 30: బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్‌పై వైసీపీ రౌడీ మూకలు దాడి చేయడం సిగ్గుచేటు అని జిల్లా యాదవ సంఘం ఉపాధ్యక్షుడు కోనాటి శివ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన రామచంద్ర యాదవ్ వైసీపీ అరాచకాలను ఎండగడుతున్నారని చెప్పారు. ప్రశాంతంగా ఎన్నికల ప్రచారం చేస్తుంటే ఆయనపై మంత్రి పెద్దిరెడ్డి రౌడీ మూకలతో దాడి చేయించడం దుర్మార్గమన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా వైసీపీకి బుద్ధి చెప్పాలని శివ యాదవ్ అన్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 30: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. శ్రీకాళహస్తి పట్టణంతో పాటు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

అన్నపై తమ్ముడి దాడి



గాయపడ్డ లీలాప్రసాద్

ఏర్పేడు, ఏప్రిల్ 30: అన్నపై తమ్ముడు దాడి చేసి గాయపరిచిన ఘటన ఏర్పేడు మండలంలోని ఎండీ పుత్తూరు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన లీలాప్రసాద్, ఈశ్వరయ్య ఇద్దరూ అన్నదమ్ముల పిల్లలు. వీరిద్దరికీ పక్కపక్కనే వ్యవసాయ భూములు ఉన్నాయి. పొలాల వద్ద కొద్దిరోజులుగా వివాదం నెలకొంది. సోమవారం సాయంత్రం పొలం వద్ద ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో ఈశ్వరయ్యతో పాటు ఆయన కుటుంబ సభ్యులు లీలాప్రసాద్‌పై ఇనుప కమ్మీలతో దాడి చేశారు. లీలాప్రసాద్ తలకు బలమైన గాయాలు కావడంతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. లీలాప్రసాద్ కుటుంబ సభ్యులు మంగళవారం ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సైకోను తరిమేద్దాం... సైకిల్‌ను స్వాగతిద్దాం: సుధీర్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, ఏప్రిల్ 30: సైకో పాలనను తరిమికొట్టి సైకిల్ పాలనకు స్వాగతం పలుకుదామని బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు, చుక్కలనిడిగల్లు, సుబ్బానాయుడుకండ్రిగ, రామలింగాపురం, ఎగువవీధి గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీతివంతమైన పాలనకోసం టీడీపీని గెలిపించాలని ప్రజలను కోరారు. స్థానిక ఎమెల్యే భూదందాలు, ఇసుక మాఫియాతో, అక్రమంగా సంపాదించిన డబ్బుతో ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలను పట్టి పీడిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గోపాలన్న బిడ్డగా శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి తీరుతానన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కామేష్‌యాదవ్, రంగినేని చంచయ్యనాయుడు, బొల్లినేని జగన్నాథం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: పట్టణంలోని బుగ్గవీధిలో ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి బొజ్జల రిషితారెడ్డి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను అందజేస్తూ కూటమి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. సైకిల్‌గుర్తుపై ఓటు వేసి సుధీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

తొట్టంబేడు: శ్రీకాళహస్తి మండలంలోని వేడాం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కామినేటి సుబ్రహ్మణ్యం, సుధాకర్, చిన్నరామయ్య, షబ్బీర్, శివకుమార్, సునీల్, గోవర్ధన్‌తో పాలు పలువురు నాయకులు టీడీపీలో చేరారు. అలాగే తొట్టంబేడు మండలంలోని పెద్దకనపర్తి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వారందరికీ బొజ్జల సుధీర్‌రెడ్డి పసుపు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



టీడీపీలో చేరిన వారితో బొజ్జల సుధీర్‌రెడ్డి

ఏడాదిలోగా సముద్ర ముఖద్వారాల పూడిక తీయిస్తా

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు



గూడూరులో జరిగి సమావేశంలో వరప్రసాదరావు తదితరులు

గూడూరు, ఏప్రిల్ 30: తాను ఎంపీగా గెలిస్తే ఏడాదిలోగా సముద్ర ముఖద్వారాల పూడిక తీయిస్తానని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు హామీ ఇచ్చారు. మంగళవారం పట్టణంలోని సనత్ నగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర పర్యావరణ ఆంక్షలు సడలించి నిలిచిపోయిన పలు అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తానన్నారు. అమృత్ నిధులు తీసుకొచ్చి మున్సిపాల్టీలో అభివృద్ధి పనులు చేపడుతానన్నారు. కోతకు గురయ్యే ప్రాంతాలు సహా కండలేరుకు కాంక్రీట్ రివిట్‌మెంట్, గూడూరు చెరువు అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేయిస్తామన్నారు. నియంతలా వ్యవహరిస్తున్న సీఎం జగన్‌కు పరిపాలించే అర్హత లేదన్నారు. జగన్‌కు అహంకారం పెరిగిపోయిందని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. ఆయనే స్వయంగా సిలికా, క్వార్ట్జ్, మద్యం వంటి అక్రమ వ్యాపారాలు సాగిస్తూ కోట్ల రూపాయలను కొల్లగొట్టారన్నారు. నిరంకుశ వైసీపీని ఓడించేందుకు బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా ఏర్పడిందన్నారు. రానున్న ఎన్నికలో కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. అనంతరం విశ్రాంత బ్యాంకు మేనేజర్ నరసప్పను బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో చంద్రప్ప, పి.పురుషోత్తంరెడ్డి, గిరిరెడ్డి, కోటారెడ్డి, పి.కోటేశ్వరరావు, ఎ.బాలకృష్ణమనాయుడు, వై.వెంకటసుబ్బయ్య, మన్నెం శీనయ్య, వల్లూరు మోహన్, వినీష్, దిలీప్, బిందురెడ్డి, మనోజ్‌కుమార్, లక్ష్మీ, జీనత్, భవానీ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో అభివృద్ధి పథంలో దేశం

మనుబోలు: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో మనదేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని వరప్రసాదరావు అన్నారు. సర్వేపల్లి నియోజకవర్గం మనుబోలు మండలం అక్కంపేటలో బీజేపీ నాయకుడు కృష్ణారెడ్డి నివాసంలో ఎన్డీఏ కూటమి నాయకులతో సమావేశమయ్యారు. ప్రపంచ దేశాల్లో ఎక్కడికెళ్లినా భారతదేశం పేరు చెప్పగానే మోదీని ప్రస్తావిస్తున్నారన్నారు. గాడితప్పిన ఏపీ అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రవీంద్రరెడ్డి, సురేంద్రరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు



అక్కంపేటలో బీజేపీ నాయకులతో వరప్రసాదరావు భేటీ

వలంటీర్లతో వైసీపీ రాజకీయం



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ అభ్యర్థి మధుసూదనరెడ్డి

శ్రీకాళహస్తి ఏప్రిల్ 30: శ్రీకాళహస్తి పట్టణంలో రాజీనామా చేయించిన వలంటీర్లతో వైసీపీ నేతలు మంగళవారం సమావేశమయ్యారు. విందు భోజనం పెట్టి ఎన్నికల వరకు వైసీపీ గెలుపు కోసం పనిచేయాలని కోరారు. అంటీముట్టినట్టు వ్యవహరిస్తే ఊరుకోబోమంటూ హెచ్చరించారు. ఐదేళ్లపాటు జీతం ఇచ్చామన్న సెంటిమెంట్ మాటలతో కొందరిని... అనుకూలంగా పనిచేయకపోతే ఇబ్బందులకు గురిచేస్తామని మరికొందరిని దారికి తెచుకున్నారు.

కాలుష్యం నుంచి రక్షించండి



క్వారీ రోడ్డుకు అడ్డంగా కూర్చొని ధర్నా చేస్తున్న లింగమనాయుడుపల్లెవాసులు

తొట్టంబేడు, ఏప్రిల్ 30: క్వారీ నుంచి వెలువడే కాలుష్యం నుంచి రక్షించాలని మండలంలోని లింగమనాయుడుపల్లి గ్రామస్థులు మంగళవారం ధర్నా నిర్వహించారు. నాయుడుపేట - పూతలపట్టు జాతీయ రహదారి విస్తరణ పనులు నిర్వహిస్తున్న కంపెనీ లింగమనాయుడుపల్లి వద్ద క్వారీ, తారుప్లాంటు నిర్వహిస్తోందని, క్వారీలో రాత్రుల్లో బ్లాస్టింగ్ నిర్వహిస్తుండడంతో గ్రామంలోని ఇళ్లు బీటలు వారుతున్నాయని తెలిపారు. క్వారీ, తారుప్లాంట్ నుంచి వచ్చే వ్యర్థాలతో నీరు, గాలి కలుషితమై రోగాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పులివెందుల, పుంగనూరు సంస్కృతి సత్యవేడులో చెల్లదు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పిచ్చాటూరు, ఏప్రిల్ 30: పులివెందుల, పుంగనూరు నియోజకవర్గాల సంస్కృతి సత్యవేడులో చెల్లదని, వైసీపీ నాయకులు ఎన్ని అరాచకాలు, కుట్రలు చేసినా సత్యవేడు ఎమ్మెల్యేగా గెలిచేది కోనేటి ఆదిమూలం మాత్రమేనని టీడీపీ జిల్లా ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రవి స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని గోవర్ధనగిరి, కారూరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలు కరపత్రాలను పంపిణీ చేసి సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల అభ్యున్నతి కోసం గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 27 పథకాలను రద్దు చేసిన జగన్ లాంటి అరాచక పాలకుడిని ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు.

ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బృందమ్మ

ఏర్పేడు, ఏప్రిల్ 30: ఏర్పేడు మండలం కొత్తవీరాపురం అరుంధతివాడ ఎస్సీ మహిళలతో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గోపాలకృష్ణారెడ్డి చేసిన అభివృద్ధిని వివరించారు. సుధీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ధనంజయనాయుడు, మోహన్‌రెడ్డి, నాగరాజునాయుడు, జడ్పీటీసీ తిరుమలయ్య, జనార్దన్, గౌరమ్మ, రాందాసు, మురగయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

తొట్టంబేడు, ఏప్రిల్ 30: మండలంలోని కాసరం, చియ్యవరం, చోడవరం, కొత్తకండ్రిగ, విరుపాక్షిపురం గ్రామాల్లో స్థానిక ఎస్ఐ రాఘవేంద్ర ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు మంగళవారం కవాతు నిర్వహించాయి.

రాష్ట్రాభివృద్ధి కోసం బాబును మళ్లీ రప్పిద్దాం



బాబుని మళ్లీ రప్పిద్దాం కార్యక్రమంలో టీడీపీ నాయకులు

నారాయణవనం, ఏప్రిల్ 30: వైసీపీ అరాచక పాలన, దౌర్జన్యాల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుని, అభివృద్ధి చేసుకోవడానికి బాబును మళ్లీ రప్పిద్దామని టీడీపీ నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బాబును మళ్లీ రప్పిద్దాం కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి మేనిఫెస్టోకు చెందిన కరపత్రాలను అందించారు. సైకిల్ గుర్తుపై ఓటేసి సత్యవేడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆదిమూలంను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కరన్, గోవిందస్వామి, ఊరప్ప, గోవింద శెట్టి, కేఎస్.రవి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపు... అభివృద్ధికి మలుపు

పిచ్చాటూరు, ఏప్రిల్ 30: ఎన్డీఏ కూటమి గెలుపు అభివృద్ధికి మలుపు అని బీజేపీ మండల అధ్యక్షుడు నడంబరం ఆనంద నాయుడు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

పుత్తూరు వార్తలు

ఆర్థిక సాయం

వడమాలపేట, ఏప్రిల్ 30: మండలంలోని పత్తిపుత్తూరుకు చెందిన సరోజమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. ఆమె నిరుపేద కావడంతో కర్మక్రియల కోసం స్థానిక టీడీపీ నేత మునిరత్నం ఆధ్వర్యంలో చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

చిరువ్యాపారుల ఆందోళన

నారాయణవనం, ఏప్రిల్ 30: నారాయణవనం మేజర్ పంచాయతీలో సంత నిర్వహిస్తున్న చిరు వ్యాపారులు మంగళవారం రోడ్డుపై నిలబడి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ నిర్ణయించిన మార్కెట్ రుసుం కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు చిరువ్యాపారులతో చర్చించారు. పంచాయతీ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.



ఆందోళన వ్యక్తం చేస్తున్న వ్యాపారులు

పవర్‌లూమ్స్‌కు ఉచిత విద్యుత్తు: భానుప్రకాష్



మీడియాతో మాట్లాడుతున్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 30: పవర్‌లూమ్స్‌కు నెలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్తును ప్రకటిస్తూ ఎన్నికల మేనిఫెస్టోలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేనాని పవన్‌కల్యాణ్ ప్రకటించడం సంతోషంగా ఉందని ఎన్డీఏ కూటమి నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక విపరీతంగా పెంచిన విద్యుత్ చార్జీలతో పవర్‌లూమ్స్ రంగం కుదేలైందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల ప్రచార సమయంలో రోజా పవర్‌లూమ్స్‌కు ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని గుర్తుచేశారు. రెండేళ్ల క్రితం బాదుడే బాదుడు కార్యక్రమానికి నగరికి వచ్చిన చంద్రబాబు పవర్‌లూమ్స్ కార్మికుల సమస్యలను గుర్తిస్తూ టీడీపీ అధికారంలోకి వస్తే నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్తు హామీని ప్రకటించారని చెప్పారు. అలాగే యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ సైతం ఉచిత విద్యుత్ హామీని పునరుద్ఘాటించారని తెలిపారు. రైతులకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయంతో పాటు రాయితీ పథకాలను పునరుద్ధరిస్తామని ప్రకటిస్తూ అన్నదాతల్లో భరోసా నింపారని కొనియాడారు. మేనిఫెస్టోలో మహిళలకు పెద్దపీట వేసి తాను మహిళా పక్షపాతినని చంద్రబాబు నిరూపించుకున్నారని వివరించారు. తొలి సంతకం మెగా డీఎస్సీపైనే అని ప్రకటించడంతో నిరుద్యోగ యువతలో భరోసా నింపారని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో ఆర్థికంగా, సామాజికంగా ఎదిగే లక్ష్యంతో మేనిఫెస్టో రూపకల్పన చేసినట్లు ఆయన తెల్పి చెప్పారు. సమావేశంలో గంజి మాధవయ్య, ఏలుమలై (అమ్ములు), గాలి జీవరత్నంనాయుడు, రవికుమార్, ఎస్ఎన్ ధనపాల్, బాలాజీ పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం ఎన్డీఏ కూటమిని గెలిపించండి

వడమాలపేట, ఏప్రిల్ 30: రాష్ట్రంతో పాటు నగరి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్డీఏ కూటమి నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని టీడీపీ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు మణిరాజు కోరారు. మంగళవారం మండలంలోని ఎస్‌బీఆర్‌పురం పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి తాండవిస్తోందని, ఆర్థిక లోటు తీర్చాలంటే సంపదను సృష్టించే సత్తా కలిగిన చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రచారంలో టీడీపీ నాయకులు రవికుమార్, ధనంజయులు నాయుడు, సుబ్రహ్మణ్యం యాదవ్, పెద్దబ్బరాజు, సుకుమార్, సూర్య, రమేష్, చిరంజీవి, బాబు రాజు, రవి, శేఖర్ రాజు, భాను ప్రకాష్, సుబ్రహ్మణ్యం రాజు, వెంకటేష్ బాలాజీ, భాస్కర్, కృష్ణయ్య, మనోహర్, మాతయ్య, జనసేన నగరి ఇన్‌చార్జి మహేష్ నాయకులు మునిశేఖర్, సునీల్, చిరంజీవి, తరుణ్, వినోద్, శేషు, రాజేష్, చెంచు తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌బీఆర్ పురంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

డీఈఈఈ సెట్‌కు 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 30: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఈఈ) సెట్-2024కు ఈనెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కార్వేటినగరంలోని ఉమ్మడి జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్, జిల్లా విద్యాశాఖాధికారి వి.శేఖర్ తెలిపారు. ఇంటర్మీడియట్‌లో 50 శాతం మార్కులు సాధించిన జనరల్ కేటగిరీ విద్యార్థులు, 45 శాతం మార్కులు సాధించిన ఎస్సీ ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులన్నారు. సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్ష 24వ తేదీ జరుగుతుందని, 30న ఫలితాలు వెలువడుతాయని పేర్కొన్నారు. ఉత్తీర్ణులైనవారు జూన్‌6నుంచి 8వ తేదీలోపు వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవాన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత ప్రవేశాలు ఉంటాయని వివరించారు. జూన్ 20వతేదీ నుంచి తరగతులు ప్రారంభమౌతాయన్నారు.

ప్రైవేట్ స్కూల్స్‌లో ఉచిత ప్రవేశానికి 827 మంది ఎంపిక

తిరుపతి(విద్య), ఏప్రిల్ 30:ఆర్‌టీఈ యాక్ట్ 12(1) ప్రకారం ప్రైవేట్ స్కూల్స్‌లో 25 శాతం ఉచిత సీట్లలో ప్రవేశానికి జిల్లాలో 827మంది విద్యార్థులు ఎంపికైనట్లు డీఈవో వి.శేఖర్ తెలిపారు. ఫేజ్-1 కింద ఒకటో తరగతిలో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదలైందని వెల్లడించారు. ప్రవేశాలు పొందిన విద్యార్థుల వివరాలను గూగుల్ షీట్‌లో నమోదు చేయాలని, ప్రవేశాలను తిరస్కరించిన విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అన్ విల్లింగ్ లెటర్‌ను తీసుకుని తన కార్యాలయానికి పంపించాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను డీఈవో ఆదేశించారు.

కళాకారులకు ఉగాది పురస్కారాలు



తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 30: తిరుపతికి చెందిన కూచిపూడి కళా క్షేత్రం శ్రీకృష్ణనటరాజాలయం ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో ఆఫీసర్స్ క్లబ్‌లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. 140 మంది కళాకారులకు, 60 మంది గాయకులకు ఉగాది పురస్కారాలు అందజేసినట్లు శ్రీకృష్ణనటరాజాలయం వ్యవస్థాపకుడు, నృత్య శిక్షకుడు కొండా రవి తెలిపారు.

గజ వాహనంపై పద్మావతీ దేవి



తిరుచానూరు, ఏప్రిల్ 30: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారు గజ వాహనంపై మంగళవారం రాత్రి ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం అమ్మవారి జన్మనక్షత్రం ఉత్తరాషాడను పురస్కరించుకుని అర్చకులు విశేషాది పూజలు నిర్వహించారు. సాయంత్రం సర్వ అలంకార శోభితురాలైన పద్మావతి దేవి గజ వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్లు మధు, శేషగిరి, చంద్రశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గణేష్, సుభాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విలువలు పెంపొందించుకోవాలి



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 30: విద్యార్థులు ఉన్నత విలువలను పెంపొందించుకోవాలని ఎస్వీ యూనివర్సిటీ వీసీ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీ డే శ్రీనివాసా ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించారు. రిజిస్ట్రార్ హుస్సేన్, ప్రిన్సిపాల్ నరసయ్య, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజీఎంల సేవలు భేష్: సీఎండీ



ఉద్యోగులను సన్మానిస్తున్న సీఎండీ సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 30: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్‌పీడీసీఎల్) వినియోగదారులకు వి.సురేష్‌కుమార్, కె.విజయకుమార్‌రెడ్డి, బి.చంద్రశేఖరరావులు చేసిన సేవలు భేష్ అని సంస్థ సీఎండీ కె.సంతోషరావు ప్రశంసించారు. జీఎం స్థాయి అధికారులైన వీరు మంగళవారం పదవీ విరమణ చేసిన సందర్భంగా తిరుపతి కార్పొరేట్ కార్యాలయ ప్రాంగణంలోని అనెక్స్ భవనంలోని సమావేశ మందిరంలో సన్మానించారు. డైరెక్టర్లు ఎస్వీఎస్ సుబ్బరాజు, శివప్రసాద్‌రెడ్డి, సీజీఎంలు జె.రమణాదేవి, పి.అయూబ్‌ఖాన్, వై.లక్ష్మీనరసయ్య, కేఆర్‌ఎస్ ధర్మజ్ఞాని, డి.ఎస్.వరకుమార్, కె.గురవయ్య, ఆదిశేషయ్య, పి.మురళి, తిరుపతి సర్కిల్ ఎస్ఈ ఎం.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్వంలో నేటినుంచి సమ్మర్ క్యాంప్

తిరుపతి(విద్య), ఏప్రిల్ 30: వరదరాజనగర్‌లోని విశ్వంస్కూల్‌లో బుధవారం నుంచి జూన్ 5వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఈక్యాంప్‌లో భాగంగా మూడు నుంచి ఏడు తరగతులకు మ్యాథ్స్, సైన్స్, రీజనింగ్, ఇంగ్లీషు గ్రామర్, 8-10తరగతులకు మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, బయాలజీ, ఇంగ్లీషు గ్రామర్, రీజనింగ్‌లతోపాటు సైనిక్, నవోదయ, మిలటరీస్కూల్స్, ఐఐటీ(జేఈఈ), నీట్, ఇతర పోటీపరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం 9నుంచి సాయంత్రం 5.30గంటలవరకు తరగతులు జరుగుతాయని, హాస్టల్ సదుపాయం కూడా ఉందని తెలిపారు. వివరాల కోసం 86888 88802,03/93999 76999 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

15నుంచి క్రీడా శిక్షణ శిబిరాలు

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 30: వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఈనెల 15నుంచి జూన్ 14తేదీ వరకు నిర్వహించాలని క్రీడలశాఖ ముఖ్యకార్యదర్శి ప్రద్యుమ్న మంగళవారం ఆదేశాలు జారీచేసినట్లు జిల్లా క్రీడాకాధికారి సయ్యద్‌సాహేబ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'క్రీడా శిక్షణ శిబిరాలు లేనట్టేనా' అన్న శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన సంబంధిత విభాగం ఎన్నికల పోలింగ్ ముగిశాక శిబిరాలు నిర్వహించాలని ఆదేశాలు జారీచేశారు.

విద్యార్థినికి ఆరణి అభినందనలు



లక్ష్మీప్రియను అభినందిస్తున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 30: ప్రభుత్వ పాఠశాలలో చదివి కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన లక్ష్మీప్రియను తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు అభినందించారు. శ్రీకాళహస్తికి చెందిన లక్ష్మీప్రియ పదో తరగతిలో 600 మార్కులకుగాను 596 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినితోపాటు ఆమె తల్లిదండ్రులను మంగళవారం జనసేన కార్యాలయానికి పిలిపించి, వారితో కాసేపు మాట్లాడారు. భవిష్యత్తులోనూ మరింత బాగా చదివి ఉన్నతస్థానాన్ని అధిరోహించాలని ఆశీర్వదించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించిన డాక్టరుకు మెమో

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 30: అత్యవసర విభాగంలో రోగులకు అందుబాటులో ఉండాల్సిన డ్యూటీ డాక్టరు అధికారుల తనిఖీల్లో విధుల్లో లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ కె.ప్రవీణ్‌కు సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు మెమో జారీ చేశారు. ఈనెల 25 తేదీ రాత్రి అత్యవసర విభాగాన్ని సీఎస్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మానాయక్ తనిఖీ చేశారు. ఆ సమయంలో డాక్టర్ ప్రవీణ్ విధుల్లో లేకపోవడం.. ఆపై ఆలస్యంగా విధులకు రావడాన్ని గుర్తించారు. ఈ విషయంపై డాక్టర్‌ని మందలించడంతోపాటు డీఎంఈకి, సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన సూపరింటెండెంట్ మెమో జారీ చేశారు.

పట్టపగలే రౌడీషీటర్‌కు కత్తిపోట్లు

తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు





చికిత్స పొందుతున్న దిలీప్ - లొంగిపోయిన యువరాజ్

మంగళం, ఏప్రిల్ 30: మంగళం క్వార్టర్స్ వద్ద మంగళవారం పట్టపగలే రౌడీషీటర్ దిలీప్ అలియాస్ తంబిపై అతడి అనుచరుడే కత్తితో దాడిచేయడం సంచలనం రేకెత్తించింది. ఆపై నిందితుడైన యువరాజ్ నేరుగా తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. యువరాజ్, దిలీప్‌లు కొంతకాలం క్రితం మంగళం పరిధిలోనే నివాసం ఉండేవారు. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో దిలీప్ కరకంబాడి వద్ద గల తారకరామానగర్‌కు తన నివాసం మార్చేశాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య తలెత్తిన విభేదాలను పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవడానికి రావాలని దిలీప్‌కు యువరాజ్ సమాచారం పంపాడు. అతడి మాటలు నమ్మి మంగళం క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. అందరూ మాట్లాడుతుండగా యువరాజ్ కత్తి తీసుకొచ్చి దిలీప్ ఛాతీపై పొడిచాడు. ఊహించని ఈ సంఘటనతో దిలీప్ అతడి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో చెయ్యి అడ్డుపెట్టడంతో ఎడమచేతిపైనా రక్తగాయాలయ్యాయి. ఒక్కసారిగా దిలీప్ కుప్పకూలి పోవడంతో నిందితుడి అక్కడి నుంచి తప్పించుకుని.. తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. కత్తిపోట్లకు గురైన దిలీప్‌ని సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపం.. రోగులకు శాపం

● రుయాస్పత్రిలో ఇదీ పరిస్థితి





తండ్రికి పెట్టిన సెలైన్ బాటిల్‌ను చేత్తో పట్టుకొని వస్తున్న యువతి - వార్డుల్లోని రోగులకు ఉపయోగించే దుప్పట్లను వీల్‌చైర్లో తీసుకొస్తున్న బాలుడు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 30: రుయాస్పత్రిలో ఎటు చూసినా అధికారుల పర్యవేక్షణ లోపం కనిపిస్తోంది. ఇది రోగుల పాలిట శాపంలా మారుతోంది. రుయాస్పత్రిలో మంగళవారం కనపించిన ఈ చిత్రాలే అందుకు నిదర్శనం. సాధారణంగా సెలైన్ పెట్టుకొన్న రోగి వార్డులో నుంచి బయటకు రాకూడదు. అలా రావాలంటే వైద్య సిబ్బంది పర్యవేక్షణలోనే రావాలి. రోగి చేతికి పెట్టివున్న సెలైన్‌ను కూడా సిబ్బంది మాత్రమే పట్టుకోవాలి. కానీ ఎంఎస్ వార్డులో చికిత్స పొందుతున్న రోగిని వైద్య పరీక్షలకు తీసుకువెళ్లేందుకు ఎవరూ లేకపోవడంతో ఆయన కుమార్తె సెలైన్ బాటిల్‌ను ఒక చేతితో, తన తండ్రిని మరో చేతితో పట్టుకొని నడిపించుకుంటూ వైద్య పరీక్షలకు తీసుకెళ్లాల్సి వచ్చింది. అలాగే వార్డుల్లో ఉపయోగించే దుప్పట్లు, మందులు తదితర వైద్య పరికరాలను ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలు మాత్రమే తీసుకెళ్లాలి. అయితే ఏక్లాస్ గదుల మీదుగా వార్డులకు వెళ్లే మార్గంలో ఓ ఎఫ్ఎన్‌వో తాను చేయాల్సిన పనిని అక్కడే రోగికి సాయంగా ఉన్న ఓ బాలుడికి అప్పగించి, ఆమె వెనుక తీరిగ్గా వార్డుకు చేరుకుంది. వీటిపై ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బీసీలను తప్పుదోవ పట్టిస్తున్న వైసీపీ

టీడీపీ బీసీ సెల్ నాయకుల విమర్శ



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ బీసీ సెల్ నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 30: బీసీలను తప్పుదోవ పట్టించేలా వైసీపీ నాయకుడు బొమ్మగుంట రవి వ్యవహరిస్తున్నారని టీడీపీ బీసీ సెల్ నాయకుడు జగన్నాథం ఆరోపించారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తన స్థాయిని మరిచిపోయి మాజీ సీఎంలు చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డిలను ఏకవచనంతో సంబోధించడం తగదని హితవు పలికారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని సూచించారు. లేకపోతే ఇలాంటి వారి కారణంగా వైసీపీకి ఎన్నికల్లో పరాజయం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో చేజర్ల మనోహరాచారి, ఆముదాల తులసీదాసు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డీ.. పద్ధతి మార్చుకో

● తిరుపతి అసెంబ్లీ బీసీవై అభ్యర్థి కృష్ణవేణి



విలేకరులతో మాట్లాడుతున్న కృష్ణవేణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 30: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన పద్ధతి మార్చుకోవాలని తిరుపతి అసెంబ్లీ బీసీవై పార్టీ అభ్యర్థి కృష్ణవేణి సూచించారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ పుంగనూరులో బీసీవై పార్టీ నేత బోడే రామచంద్రయాదవ్ వాహనాలపై పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దాడులు చేయించారని ఆరోపించారు. పుంగనూరులో ఉన్న దారుణ పరిస్థితుల గురించి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. దౌర్జన్యానికి పాల్పడుతున్న పెద్దిరెడ్డిని ఓడించి, బీసీవై పార్టీ నేత రామచంద్రయాదవ్‌ను పుంగనూరు ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీవై పార్టీ మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో ట్రాన్స్‌కో ఏఈ

● ట్రాన్స్‌ఫార్మర్ బిగించేందుకు రైతు నుంచి డబ్బు డిమాండ్



ఏసీబీకి చిక్కిన ట్రాన్స్‌కో ఏఈ వెంకటరత్నం

కురబలకోట, ఏప్రిల్ 30: అన్నమయ్య జిల్లా కురబలకోట ట్రాన్స్‌కో ఏఈ రత్నం లంచం తీసుకుంటూ మంగళవారం కడప ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. దీనికి సంబంధించి ఏసీబీ డీఎస్పీ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ చింతపల్లెకు చెందిన రైతు మధుకర్ రెడ్డి తన పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం గత ఏడాది నవంబరులో దరఖాస్తు చేసుకున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్‌ను తన పొలంలో బిగించాలని ఏఈని కోరాడు. దీంతో అతను రైతు వద్ద నుంచి రూ.35 వేల లంచం డిమాండ్ చేయగా రూ.32 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. కాగా అంగళ్ల సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఒ కేఫ్‌లో రైతు వద్ద నుంచి డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏసీబీ సిబ్బంది తనిఖీలు చేపట్టారు.

అదనపు బ్యాలెట్ యూనిట్లు అవసరం: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 30: రాజకీయ పార్టీల నేతల సమక్షంలో బ్యాలెట్ యూనిట్ల మొదటి విడత సప్లమెంటరీ నిర్వహించినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నామినేషన్ల పర్వం ముగియడంతో అభ్యర్థుల తుది జాబితా ప్రకటించామన్నారు. చంద్రగిరి, తిరుపతి పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో అదనంగా ఈవీఎంలు అవసరమవుతాయని తెలిపారు. రెండు నియోజకవర్గాలకు కలిపి ఇంకా 1,133 బ్యాలెట్ యూనిట్లు కావాలని, రిజర్వులో ఉన్న 682 పోను అదనంగా 451 అవసరమవుతాయని చెప్పారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గానికి బ్యాలెట్ యూనిట్లు 2,566 కావాలని, రిజర్వులో ఉన్న 644పోను అదనంగా 1,922 అవసరమవుతాయని తెలిపారు. ఈ మేరకు సీఈవో కార్యాలయం, బెల్ ఇంజనీర్లతో సమన్వయం చేస్తున్నామన్నారు. రిజర్వులో ఉన్న 656 బ్యాలెట్ యూనిట్లకు తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం కోసం మొదటి విడత సప్లమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టి పూర్తిచేసినట్లు తెలియజేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బ్యాలెట్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సార్వత్రిక ఎన్నికల సాధారణ పరిశీలకులు ఉజ్వల్‌కుమార్ ఘోష్, జ్యోతి, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చు విషయంలో జాగ్రత్త వహించాలి

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఖర్చుల విషయంలో జాగ్రత్తలు వహించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో తిరుపతి పార్లమెంటుకు పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల ఖర్చు విషయంపై అవగాహన కల్పించారు. పార్లమెంటు నియోజకవర్గ సాధారణ పరిశీలకులు ఉజ్వల్‌కుమార్ ఘోష్, అసెంబ్లీ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు జ్యోతి, అధికారులు ప్రదీప్‌కుమార్, అరవింద్ సాల్వే పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



అభ్యర్థులతో సమావేశం నిర్వహిస్తున్న అబ్జర్వర్ ఘోష్

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 30: అభ్యర్థులందరూ ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని తిరుపతి నియోజకవర్గం ఎన్నికల ప్రధాన అబ్జర్వర్ ఉజ్వల్ కుమార్ ఘోష్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం తిరుపతి నియోజకవర్గంలో ఆర్వో ఆదితిసింగ్‌తో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థులు, వారి ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. అభ్యర్థుల పేరిట నమోదయ్యే ఖర్చులపై అవగాహన కల్పించారు. అనంతరం కచ్చపి మందిరంలో జరిగిన సమావేశంలో ఆర్వో ఆదితిసింగ్ మాట్లాడుతూ ఓటర్ స్లిప్పులను సంబంధితులకు మాత్రమే అందించాలని బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు. ఓటర్లు ఇంటి వద్ద లేకపోతే ఆ స్లిప్పులను మున్సిపల్ కార్యాలయంలో అప్పగించాలన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక

రామచంద్రపురం, ఏప్రిల్ 30: వెంకట్రామపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాల ఆవరణలో మంగళవారం హైదరాబాద్‌కు చెందిన దివిస్ లేబొరేటరీస్ సంస్థ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. కళాశాలకు చెందిన 65మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారని ప్రిన్సిపాల్ ఎం.నిరంజన్‌బాబు తెలిపారు. బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీలో చివరి సంవత్సరం చదువుతున్న 100మంది విద్యార్థులు పాల్గొనగా, 65మంది ఎంపికయ్యారన్నారు. వీరికి రూ.2.5లక్షలు వార్షిక వేతనం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దివిస్ లేబొరేటరీస్ తరఫున అమర్‌నాథ్, పూర్ణప్రసాద్, కళాశాల కరస్పాండెంట్ సుమలత పాల్గొన్నారు.

రామచంద్ర యాదవ్‌తో పాటు 13 మందిపై హత్యాయత్నం కేసు

సదుం ఘటనలో పోలీసులే ఫిర్యాదుదారులు - బీసీవైపీలో 22 మంది, వైసీపీలో 10 మందిపై కేసులు

పుంగనూరు, ఏప్రిల్ 30: సదుం మండలం ఎర్రాతివారిపల్లెలో సోమవారం జరిగిన ఘర్షణకు సంబంధించి 13మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఎవరూ ఫిర్యాదు ఇవ్వకపోవడంతో పోలీసులే ఫిర్యాదుదారులయ్యారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. బీసీవైపీ అభ్యర్థి రామచంద్రయాదవ్‌తోపాటు ఆ పార్టీకి చెందిన 21మంది, ఐదుగురు వైసీపీ కార్యకర్తలపై రెండు హత్యాయత్నం, మరో రెండు వివిధ సెక్షన్లలో కేసులు పెట్టారు. బీసీవై పార్టీ ప్రచారంలో భాగంగా సోమవారం ఎర్రాతివారిపల్లె, కల్లూరు రోడ్డు ఆర్చి వద్ద, సదుం పోలీసుస్టేషన్ వద్ద వైసీపీ నేతలు రాళ్లు, కర్రల దాడులు, ప్రచార రథం దహనం, పలు వాహనాల ధ్వంసం చేసిన ఘటనలో పలువురు గాయపడిన విషయం తెలిసిందే. ఎర్రాతివారిపల్లెలో ప్రచారం చేయడానికి అనుమతిలేకపోయినా బీసీవైపీ నేతలు రావడంపై తాము అడ్డుకున్నామని, రామచంద్రయాదవ్ మైకులో మాట్లాడుతూ అనుమతి అవసరంలేదంటూ రెచ్చగొట్టారని, పైగా వైసీపీ కార్యకర్త వేణురెడ్డిని, సర్పంచ్ మనోహర్, ఇందిరమ్మలను కొట్టిగొడవ చేశారని, అంతేగాక తమ విధులకు ఆటంకం కలిగించారని సదుం ఎస్ఐ ఇ.మారుతి ఫిర్యాదు చేశారు. రాళ్లదాడిలో ఎస్ఐ కాలికి గాయమైందన్నారు. ఈ కేసులో బీసీవైపీకి చెందిన రామచంద్రయాదవ్, ఆనందరెడ్డి, రమేశ్‌యాదవ్, అనిల్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, హరినాథరెడ్డి, భరత్‌కుమార్, పరదేశి, వెంకటేశ్, ఓంప్రకాశ్, శివకుమార్, విశ్వనాథ్, లోకనాథంపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అలాగే ఎర్రాతివారిపల్లెకు అనుమతిలేదని, వెళ్లరాదని చెప్పినా వినకుండా బీసీవై పార్టీ శ్రేణులు రాయితో కొట్టి విధులకు అడ్డుతగిలారని సదుం హెడ్‌కానిస్టేబుల్ జి.చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదుపై రామచంద్రయాదవ్, భరత్‌కుమార్, ఆనందరెడ్డి, పరదేశి, వెంకటేశ్, ఓంప్రకాశ్, శివకుమార్, కైఫ్, ప్రసాద్ తదితరులపై కేసు నమోదు చేశారు.

వైసీపీ కార్యకర్తలపై కేసులు

ఎర్రాతివారిపల్లెకు అనుమతిలేకుండా ఎందుకు వస్తున్నారని వైసీపీ కార్యకర్తలు అడ్డుకోగా రామచంద్రయాదవ్ బూతులు తిట్టి రెచ్చగొట్టడంతో వైసీపీ శ్రేణులు రాజన్న, ఆవులమణి, వెంకటరమణ, గురుమూర్తి, మనోహర్ మరికొందరు రాళ్లు, కర్రలతో వాహనాలు ధ్వంసం చేసి, పలువురిని గాయపరిచారని ఏఎస్ఐ షామీర్ ఫిర్యాదు చేశారు. దాడిలో భరత్‌కుమార్, ఆనందరెడ్డి, ఓంప్రకాశ్, దుర్గ, స్వాతి గాయపడ్డారని తెలిపారు. బీసీవైపీ వారిని చంపాలని కేకలు వేస్తూ వాహనాలపై దాడులు చేస్తూ వెంబడించినట్లు పోలీసులు కేసులు నమోదు చేశారు. గ్రామంలోకి దౌర్జన్యంగా వచ్చి అడ్డువచ్చిన వేణురెడ్డిపై దాడిచేయడంతో ఇరువర్గాలు రాళ్లు, కర్రలతో దాడులకు పాల్పడినట్లు ఎస్ఐ మారుతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై ఉన్న బీసీవైపీ ప్రచార రథానికి నిప్పుపెట్టడం, వాహనాలు ధ్వంసం చేసి, రాళ్ల దాడులకు పాల్పడిన వైసీపీ కార్యకర్తలు హరి, వంశీ, గురుమూర్తి, జావీద్, రమేశ్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కాగా సదుం విధ్వంసంపై అనంతపురం డీఐజీ అమ్మిరెడ్డి, చిత్తూరు ఎస్పీ మణికంఠ, పలమనేరు డీఎస్పీ మహేశ్వరరెడ్డి సమీక్షించారు.

ఇల్లు దగ్ధం గురించి పట్టించుకోని డీఐజీ: సదుం మండలం చిలకపాటివారిపల్లెలో బీసీవైపీ నాయకుడు ఆనందరెడ్డి ఇంటికి తాళాలు వేసి పెట్రోల్ పోసి వైసీపీ మూకలు నిప్పు పెట్టాయి. ఇంటిలోని కారును ధ్వంసం చేసి, యాక్టివా స్కూటర్‌ను కాల్చివేసి బీభత్సం సృష్టించినా దాని గురించి డీఐజీ అమ్మిరెడ్డి పట్టించుకోకపోవడం విమర్శలకు తావిచ్చింది.

ఆస్పత్రికి తీసుకెళ్లిన బీసీవైపీ శ్రేణులు ఎక్కడ..?

సదుం విధ్వంసంలో గాయపడిన బీసీవై పార్టీ నేతలు 12మందిని పుంగనూరు పోలీసులు వైద్యం కోసం సోమవారం రాత్రి తీసుకెళ్లగా మంగళవారం రాత్రి వరకు తిరిగి రాలేదు. దీనిపై వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వాహనాలను వైసీపీ మూకలు ధ్వంసం చేయడంతో పోలీసులు వారి వాహనాల్లో సదుం పోలీస్‌స్టేషన్ నుంచి రామచంద్రయాదవ్, వారి అనుచరులను పుంగనూరులో ఇంటికి చేర్చారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో వైసీపీ దాడిలో గాయపడిన బీసీవైపీ నాయకులు వెంకటేశ్, వేణుగోపాల్‌రెడ్డి, అనీల్‌కుమార్‌రెడ్డి, శివతో కలిపి 12మందిని సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ మహ్మద్ రఫీ పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వారిని పోలీసులు బలవంతంగా ఎక్కడికో తీసుకెళ్లారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఫోన్లు స్విచ్‌ఆఫ్ వస్తోందన్నారు.

డీఐజీ అమ్మిరెడ్డి పరిశీలన


సదుం, ఏప్రిల్ 30: సదుం ఘటనపై అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మణికంఠ సునిశితంగా పరిశీలిస్తున్నారు. సోమవారం రాత్రి నుంచి సిబ్బందితో సమీక్షలు, విచారణలు, వీడియో ఫుటేజీలను పరిశీలించారు. మంగళవారం ఉదయం దాడి జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. సిబ్బందితో సమీక్షించారు. కాగా బీసీవై పార్టీ వాహనంపై దాడిలో పలువురు అనుమానితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు, డీఐజీ ఆదేశాల మేరకు వారిని అరెస్టు చేసి, జడ్జి ముందు హాజరుపరుచనున్నట్లు ఎస్ఐ మారుతి తెలిపారు.



సదుం పోలీసు స్టేషన్‌కు వచ్చిన డీఐజీ అమ్మిరెడ్డి

10,01,116 సార్లు గోవిందనామాలు రాసిన కర్ణాటక విద్యార్థిని

వీఐపీ బ్రేక్ దర్శనాన్ని కల్పించిన టీటీడీ



కుటుంబీకులతో కీర్తన

తిరుమల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 10,01,116 సార్లు 'గోవిందనామాలు' రాసిన కర్ణాటక విద్యార్థినికి టీటీడీ మంగళవారం వేంకటేశ్వర స్వామి వీఐపీ బ్రేక్ దర్శనాన్ని కల్పించింది. పిల్లలు, యువతీయువకుల్లో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు 'గోవిందకోటి' రాసే కార్యక్రమాన్ని టీటీడీ గతేడాది మొదలుపెట్టిన విషయం తెలిసిందే.ఇందులో భాగంగా 10,01,116సార్లు గోవిందనామాలు రాసిన వారికి వీఐపీ బ్రేక్ దర్శనం, కోటిసార్లు రాసిన వారికి, కుటుంబ సభ్యులతో సహా వీఐపీ బ్రేక్ దర్శనం చేయిస్తామని టీటీడీ ప్రకటించింది. ఇందులో భాగంగా కర్ణాటక రాష్ట్రంలోని పెద్దబల్లాపూర్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న కీర్తన మొదటిగా 10,01,116 సార్లు గోవిందనామాలు రాసింది. ఈసందర్భంగా టీటీడీ ఛైర్మన్ కరుణాకర రెడ్డి, శ్రీవారి ఆలయ డిప్యూటీఈవో లోకనాథం.. కుటుంబ సభ్యులతో పాటు కీర్తనకు మంగళవారం శ్రీవారి దర్శనం కల్పించారు. తాను రాసిన గోవిందనామాల పుస్తకాలతో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం కీర్తన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తమ పెద్దలు, ఊరివారు చిన్నతనం నుంచి రామకోటి రాయడం చూసేదాన్నన్నారు. తమ ఇంటిదైవమైన శ్రీవారి అనుగ్రహంతో గోవిందనామాలు రాసే అవకాశం తనకు కలగడం పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నట్టు తెలిపారు. గతేడాది నవరాత్రుల నుంచి గోవిందనామాలు రాయడం ప్రారంభించి, రోజూ ఉదయం, సాయంత్రం భక్తిశ్రద్ధలతో రాశానన్నారు. స్వామి ఆశీస్సుల వల్లే తక్కువ సమయంలో 10 లక్షల సార్లు గోవిందనామాలు రాసానని, గోవిందనామాలు రాసే సమయంలో సాక్షాత్తు శ్రీవారి సన్నిధిలో ఉన్న అనుభూతి కలిగిందన్నారు.

కార్మికులతో చర్చలు జరిపాం

- హైకోర్టుకు నివేదించిన అదానీ గంగవరం పోర్టు
- కౌంటర్ వేసేందుకు సమయం కోరిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశాలకు అనుగుణంగా జిల్లా అధికారుల సమక్షంలో నిర్వాసిత కార్మికులతో చర్చలు జరిపామని అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం హైకోర్టుకు నివేదించింది. ఈ సమావేశానికి సంబంధించి పూర్తి వివరాలను న్యాయస్థానం ముందు ఉంచామని సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ కోర్టుకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎస్‌జీపీ సి.సుమన్ స్పందిస్తూ... పోర్టు యాజమాన్యం సమర్పించిన వివరాలను పరిశీలించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం తరఫున కౌంటర్ దాఖలుకు సమయమివ్వాలని అభ్యర్థించారు. విచారణను గురువారానికి వాయిదా వేయాలని కోరారు. ఈ వివరాలు పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జయసూర్య విచారణను మే 2వ తేదీకి వాయిదా వేశారు. మరోవైపు వ్యాజ్యంలో ఇంప్లీడ్ అవుతూ అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులు వేసిన అనుబంధ పిటిషన్‌ను న్యాయమూర్తి అనుమతించారు.

ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేయండి

- గుంటూరు కలెక్టర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు
- అమరావతి భూసేకరణ నోటిఫికేషన్ ఉపసంహరణపై పిల్

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో భూసేకరణ నోటిఫికేషన్‌ను ఉపసంహరిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 28న గుంటూరు జిల్లా కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య ఉపాధ్యక్షుడు ఉప్పలపాటి సాంబశివరావు, రాజధాని రైతు పరిరక్షణ సమితి జాయింట్ సెక్రటరీ ధనేకుల రామారావు ఈ పిల్‌ను దాఖలు చేశారు. అధికార దుర్వినియోగం చేస్తూ దురుద్దేశపూర్వకంగా కలెక్టర్ జారీ చేసిన నోటిఫికేషన్‌ను చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాలని కోరారు. హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పు, సీఆర్డీయే చట్టం, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనలకు కలెక్టర్ నిర్ణయం విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజధాని అమరావతి నగరాన్ని ధ్వంసం చేయాలనే ఏకైక లక్ష్యంతో భూసేకరణ ప్రక్రియను ఉపసంహరించారని ఆరోపించారు. కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్ అమలును నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకుంటే రైతులకు పూడ్చుకోలేని నష్టం జరుగుతుందన్నారు. కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరారు. 'కలెక్టర్ ఉత్తర్వులతో రాజధాని ప్రాంతంలో అక్కడక్కడ వ్యవసాయ భూములు మిగిలిపోతాయి. అమరావతి నగరం అభివృద్ధికి అవరోధం కలుగుతుంది. ప్రస్తుతం ఉన్న మాస్టర్ ప్లాన్‌కు మార్పులు చేస్తే రైతుల హక్కులకు భంగం వాటిల్లుతుంది. మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేయాలని ధర్మాసనం తీర్పు ఇచ్చింది. భూసేకరణ ప్రక్రియలో ముందుకెళ్లాలే గానీ దానిని ఉపసంహరించడానికి వీల్లేదు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయండి' అని పిటిషన్‌లో కోరారు. వ్యక్తిగత హోదాలో సీఎం జగన్, పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మితో పాటు సీఎస్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, ఏపీసీఆర్డీఏ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, గుంటూరు జిల్లా కలెక్టర్‌ను ప్రతివాదులుగా చేర్చారు.

భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత పెరుగుతున్న కొద్దీ రాష్ట్రంలో విద్యుత్తు వాడకం కూడా బాగా పెరిగింది. ఈ నెల 20వ తేదీ నుంచి 29వ తేదీ దాకా పది రోజులపాటు పెరిగిన విద్యుత్తు డిమాండ్‌ను తట్టుకునేందుకు బహిరంగ మార్కెట్లో రూ.287.65 కోట్లు పెట్టి కరెంటును డిస్కమ్‌లు కొనుగోలు చేశాయి. విద్యుత్తు అవసరాల కోసం కొంటున్న కరెంటు భారం విద్యుత్తు వినియోగదారులపైనే పడనుంది.

17 మంది వలంటీర్ల రాజీనామా... టీడీపీలో చేరిక

టెక్కలి, ఏప్రిల్ 30: 'ఐదేళ్ల పాటు మాతో గొడ్డుసేవలు చేయించుకుని ఇప్పుడేమో రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే కొందరు వైసీపీ నేతలు తమ వింటారా, లేదా అని ఎదురుప్రశ్నలు వేస్తున్నారు. వైసీపీ నాయకుల నియంతృత్వ ధోరణి మధ్య మేం ఉండలేం. మేమంతా మూకుమ్మడిగా రాజీనామా చేసి స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నాం' అని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడ గ్రామానికి చెందిన 17మంది వలంటీర్లు ప్రకటించారు. అనంతరం, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు స్వగ్రామం నిమ్మాడ కావడంతో ఆయన వద్దకు వెళ్లి తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీ కండువాలు కప్పుకొన్నారు.

అధికారం కోసం జగన్ అడ్డదారులు: వర్ల

జగన్‌రెడ్డికి కూటమితో తలపడే ధైర్యం లేక, అడ్డదారులు తొక్కైనా అధికారం నిలబెట్టుకోవాలని చూస్తున్నాడని టీడీపీ పొలిట్‌బ్యూరో వర్ల రామయ్య విమర్శించారు. అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గాజుగ్లాసు గుర్తును జనసేన పార్టీకే కేటాయించాలని హైకోర్టు ఆదేశాలివ్వగా ఇండిపెండెంట్ అభ్యర్థులకూ గాజుగ్లాసు గుర్తును కేటాయించేలా కుట్రలు చేస్తున్నారు. పుంగనూరును ప్రత్యేక సామ్రాజ్యంగా భావిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి మనుషులు టీడీపీ ప్రచార రథాలు తిరగకుండా, తగలబెడుతున్నారు. కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ వరకూ పెద్దిరెడ్డి మనుషులే కావడంతో చోద్యం చూస్తున్నారు. బీసీవై పార్టీ నేత రామచంద్ర యాదవ్‌పై దాడులు చేసినా పోలీసులు తమాషా చూస్తున్నారు. పరిస్థితులు కాస్త అటుఇటూ అయితే సీఎం అవుదామని పెద్దిరెడ్డి ఉబలాటపడుతున్నాడు. పుంగనూరులో ఏ ఆదేశాలు ఇవ్వలేని దుస్థితిలో సీఎస్, డీజీపీ ఉన్నారు' అని విమర్శించారు.

మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

- రొంపిచర్ల కేసులో తదుపరి చర్యలు నిలుపుదల

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట లోక్‌సభ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. చిత్తూరు జిల్లా రొంపిచర్ల పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నింటినీ నిలపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్‌కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఆదేశాలిచ్చారు. ఎన్నికల అధికారి నుంచి ముందస్తు అనుమతి లేకుండా రొంపిచర్ల బస్టాండ్ ప్రాంతంలో సమావేశం నిర్వహించానని ఎంపీడీవో రెడ్డెప్ప ఆచార్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ కిరణ్‌కుమార్‌రెడ్డికి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎన్‌వీ సుమంత్ వాదనలు వినిపించారు. సభలు, సమావేశాలు నిర్వహించుకొనేందుకు ఎన్నికల అధికారి నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత ఎన్నికల అధికారే ఫిర్యాదు చేయాలన్నారు. ప్రస్తుత కేసులో ఎన్నికలతో సంబంధంలేని ఎంపీడీవో ఫిర్యాదు చేశారన్నారు. నిర్దిష్ట సమయానికి ముందే పిటిషనర్ సమావేశాన్ని ముగించారన్నారు.

భారత్ సూపర్‌గా ఎదిగితే పాక్ అడుక్కుంటోంది!

- ఆ దేశ పార్లమెంటులో విపక్ష నేత వ్యాఖ్య

ఇస్లామాబాద్, ఏప్రిల్ 30: సూపర్ పవర్‌గా ఎదగాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంటే పాకిస్థాన్ నిధుల కోసం అడుక్కుంటోందని విపక్ష నేత మౌలానా ఫజులుర్ రహ్మాన్ వ్యాఖ్యానించారు. జమాత్ ఉలేమా ఎ ఇస్లాం (ఫజల్) పార్టీ నాయకుడైన ఆయన మంగళవారం పార్లమెంటు ప్రారంభ సమావేశంలో ప్రసంగించారు. దేశ పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేస్తూ "1947లో భారత్, పాకిస్థాన్‌లకు ఒకేసారి స్వాతంత్ర్యం వచ్చింది. ఇవాళ భారత దేశం ప్రపంచంలోనే సూపర్ పవర్‌గా ఎదగాలని ప్రయత్నాలు చేస్తోంది. మనం మాత్రం దివాళా పరిస్థితి నుంచి బయటపడేందుకు పోరాటం చేస్తున్నాం. ఇంతగా అంతరం ఉండడానికి కారకులు ఎవరు?" అని ఆయన ప్రశ్నించారు. ఇటీవల జరిగిన ఎన్నికల తీరుపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ఇవేమి ఎన్నికలు? ఓడిన వారు అసంతృప్తిలో ఉండడం...గెలిచిన వారిలోనూ సంతోషం కనిపించకపోవడం..ఇదేమి పరిస్థితి?" అని అన్నారు. ఎక్కువ సీట్లు పొంది ఉంటే పాకిస్థాన్ తెహరీక్ ఇన్సాఫ్ పార్టీకే అధికారాన్ని అప్పగించి పదవి నుంచి తప్పుకోవాలని ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను సూచించారు. "ప్రజలకు అవసరమైన చట్టాలు చేయలేని నిస్సహా స్థితిలో ఉన్నాం. ఇన్ని ఆంక్షలు ఉన్నప్పుడు దీన్ని ప్రజల పార్లమెంటు అనొచ్చా? ఇదేమి ప్రజాస్వామ్యం?" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో అప్పటి ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను గద్దె దింపడానికి జరిగిన పాకిస్థాన్ డెమొక్రాటిక్ మూవ్‌మెంట్ ఉద్యమంలో ఫజల్ కీలకంగా వ్యవహరించడం గమనార్హం. చరిత్రలో ఎప్పుడూ లేనంత ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌కు సోమవారమే అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) రుణాన్ని విడుదల చేయడం గమనార్హం. మొత్తం 3 బిలియన్ డాలర్ల (సుమారు 25వేల కోట్ల భారత రూపాయలు) రుణాన్ని మంజూరు చేయగా తొలి విడతగా 1.1 బిలియన్ డాలర్లు (సుమారు 9వేల కోట్ల భారత రూపాయలు) విడుదల చేసింది. రుణం మంజూరు చేసే ముందు సబ్సిడీలు తగ్గించాలని, కరెంటు ఛార్జీలు, పన్నులు పెంచాలని షరతులుగా విధించింది. మరోవైపు తీసుకున్న విదేశీ రుణాలను తిరిగి చెల్లించలేని పరిస్థితికి కూడా పాకిస్థాన్ చేరుకుంది.

మహిళా కార్యకర్తలే మహారాణులు

- స్త్రీశక్తి, మహిళా మిత్రలతో నారా బ్రాహ్మణి

దుగ్గిరాల, ఏప్రిల్ 30: తెలుగుదేశం పార్టీలో ఎప్పటికీ మహిళా కార్యకర్తలే మహరాణులని నారా లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాలలో స్త్రీశక్తి, మహిళా మిత్ర, డ్వాక్రా మహిళలతో మంగళవారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బ్రాహ్మణి మాట్లాడుతూ.. ఇంటిని సమర్థవంతంగా నడిపే మహిళలు రాజకీయాల్లోనూ మరింతగా రాణించగలరని గుర్తించే ఎన్టీఆర్ వారికి పురుషులతో సమానంగా అవకాశాలు కల్పించారన్నారు. ఎన్టీఆర్ సంక్షేమానికి కొనసాగింపుగా మహిళల ఆర్థిక స్వావలంబనకు చంద్రబాబు డ్వాక్రాలకు శ్రీకారం చుట్టి వారి స్థితిగతులను మార్చివేశారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. స్త్రీశక్తి పథకం ద్వారా శిక్షణ తీసుకుని ఉపాధి పొందామని, తద్వారా కుటుంబానికి ఆర్థికంగా తమ వంతు సాయం అందిస్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు. పలువురు ఎన్ఆర్ఐలు మాట్లాడుతూ.. టీడీపీ విజయం కోసం ప్రచారం చేయడానికి విదేశాల నుంచి సొంతూళ్లకు వచ్చామని తెలిపారు. అనంతరం దుగ్గిరాలలో పసుపు మిల్లును నారా బ్రాహ్మణి పరిశీలించారు. పసుపు ఎలా తయారు చేస్తారో అక్కడి మహిళా కార్మికులను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలు విన్నారు.



పసుపు ఫ్యాక్టరీలో మహిళా కార్మికులతో మాట్లాడుతున్న బ్రాహ్మణి

అమెరికాలో

విద్యార్థులపై ఉక్కుపాదం!

- పాలస్తీనా అనుకూల ప్రదర్శనలతో అట్టుడుకుతున్న వర్సిటీలు
- వెయ్యిమందిని అరెస్టు చేసినా.. వెనక్కి తగ్గని విద్యార్థులు
- కొలంబియా, కార్నెల్ వర్సిటీల్లో పలువురు విద్యార్థుల సస్పెన్షన్

న్యూయార్క్, ఏప్రిల్ 30: అమెరికాలోని యూనివర్సిటీలు పాలస్తీనా అనుకూల ప్రదర్శనలతో అట్టుడుకుతూనే ఉన్నాయి. ఎన్ని హెచ్చరికలు చేసినా విద్యార్థులు లెక్కచేయడంలేదు. క్యాంపస్‌లలో టెంట్లు వేసుకొని రోజుల తరబడి ఆందోళనలు కొనసాగిస్తున్నారు. పోలీసులను రంగంలోకి దించి వందలాదిమందిని అరెస్టు చేసినా, విద్యార్థులు వెనక్కి తగ్గడం లేదు. దీంతో అరెస్టుల సంఖ్య వెయ్యికి చేరుకుంటోంది. ఈ నేపథ్యంలో నిరసనకారులపై తీవ్రమైన చర్యలు చేపడుతున్నారు. కొలంబియా యూనివర్సిటీలో మంగళవారం కూడా విద్యార్థులు సుమారు 120 టెంట్లలో బైఠాయించి నిరసనలు కొనసాగించారు. ప్రవేశద్వారానికి అడ్డంగా మానవహారం నిర్వహించారు. హాస్టళ్లలోని కిటికీల నుంచి పాలస్తీనా జెండాలను ఊపుతున్నారు. ఆందోళనలు విరమించడానికి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు డెడ్‌లైన్ విధించిన కొలంబియా, కార్నెల్ యూనివర్సిటీలు.. ఆ తర్వాత పలువురు విద్యార్థులను సస్పెండ్ చేశాయి. తక్షణమే వర్సిటీని వీడాలని, హాస్టల్ భవనాలనూ ఖాళీ చేయాలని వారిని ఆదేశించాయి. అమెరికా వ్యాప్తంగా మిగిలిన యూనివర్సిటీల్లో మంగళవారం కూడా పలువురు విద్యార్థులను అరెస్టు చేశారు.

సస్పెన్షన్‌తో వసతి కూడా ఖాళీ..

అమెరికాలోని యూనివర్సిటీల్లో సస్పెండ్ అయిన విద్యార్థులు గ్రాడ్యుయేషన్ లేదా సెమిస్టర్ పూర్తి చేయడానికి అనర్హులవుతారు. వారిని తరగతులకు, పరీక్షలకూ అనుమతించరు. వర్సిటీ అనుబంధ హాస్టళ్లలో వారు వసతి కూడా కోల్పోతారు. వారిని అకడమిక్ భవనాల్లోకి కూడా అనుమతించరు. గ్రాడ్యుయేషన్ చేయడానికీ వారు అర్హత కోల్పోతారు. ఈ మేరకు కొలంబియా యూనివర్సిటీ క్యాంపస్‌లో నోటీసు అంటించారు. కార్నెల్ యూనివర్సిటీలోనూ అలాంటి నోటీసునే అంటించారు. ఒకసారి క్రమశిక్షణ చర్యలకు గురైతే, వారిపై వర్సిటీలోని వివిధ విభాగాలు విచారణ జరుపుతాయని కొలంబియా యూనివర్సిటీ ప్రజాసంబంధాల విభాగం ఉపాధ్యక్షుడు బెన్ చాంగ్ తెలిపారు. యూనివర్సిటీ లైఫ్ కార్యాలయం, యూనివర్సిటీ సెనేట్ కార్యాలయం క్రమశిక్షణ చర్యల ప్రక్రియను చేపడతాయని వివరించారు. కాగా, సస్పెన్షన్‌కు గురైన పలువురు విద్యార్థులు తమను హాస్టల్ నుంచి కూడా పంపించేశారని స్థానిక మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తాము ఎక్కడ నివసించాలంటూ విలపిస్తున్నారు. సస్పెన్షన్‌కు గురైన విదేశీ విద్యార్థుల వీసాలు కూడా రద్దయ్యే ప్రమాదం ఉందని అటార్నీ రాధికా సాయినాథ్ తెలిపారు.

భారతీయ విద్యార్థులు.. తల్లిదండ్రుల్లో ఆందోళన..

తాజా పరిస్థితి విదేశీ విద్యార్థులపై, ప్రత్యేకించి భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. క్యాంపస్‌లో తరగతుల నిర్వహణకు అవాంతరాలు కలుగుతుండటంతో కొలంబియా యూనివర్సిటీ వంటి విద్యాసంస్థలు ఆన్‌లైన్ బోధన చేపట్టాయి. దీంతో భారతీయ విద్యార్థులు తమ భవితవ్యంపై ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయంపై స్వదేశంలోని వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కూడా ఆందోళన చెందుతున్నారు. నిరసనల్లో పాల్గొని అరెస్టయినవారిలో భారతీయ విద్యార్థులు కూడా ఉన్నారు. దీంతో వారి వీసా, స్కాలర్‌షిప్‌లకు కూడా ముప్పు పొంచి ఉందనే ఆందోళనలు నెలకొన్నాయి. 'విదేశీ విద్యార్థులు మూడు స్థాయిల్లో అమెరికా చట్టాలను, విధానాలను పాటించాలి. అమెరికా ఫెడరల్ చట్టానికి, రాష్ట్ర చట్టానికి వారు కట్టుబడి ఉండాలి. యూనివర్సిటీలు రాష్ట్ర చట్టం పరిధిలోకి వస్తాయి. ఫెడరల్, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతోపాటు విద్యాసంస్థ విధానాలకూ వారు కట్టుబడి ఉండాలి. ఇందులో ఏ స్థాయిలోనైనా అతిక్రమణకు పాల్పడితే 'విద్యార్థి హోదా'నే అతిక్రమించినట్టు భావించి.. వారిని అమెరికా నుంచి పంపించేసే అవకాశం కూడా ఉంది' అని ఇమ్మిగ్రేషన్.కాం మేనేజింగ్ అటార్నీ రాజీవ్ ఖన్నా పేర్కొన్నారు.

అమెరికాను వీడాల్సిందే!

ఎఫ్-1 వీసాపై చదువుకొంటున్న విదేశీ విద్యార్థులు అమెరికాలో ఉండాలంటే తప్పనిసరిగా 'విద్యార్థి హోదా'ను కాపాడుకోవాలి. విద్యాసంస్థ నుంచి సస్పెన్షన్ లేదా బహిష్కరణకు గురైన విద్యార్థుల ఎఫ్-1 వీసాకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. 'ఒకసారి విద్యార్థి సస్పెన్షన్ లేదా బహిష్కరణకు గురైతే, సెవిస్(స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టం)లో ఆ విద్యార్థి అడ్మిషన్‌ను విద్యాసంస్థ తప్పనిసరిగా తొలగించాలి. అదే జరిగితే ఎఫ్-1 లీగల్ హోదాను ఆ విద్యార్థి కోల్పోయినట్టే' అని లాక్వెస్ట్ మేనేజింగ్ పార్టనర్ పూర్వి చోతని తెలిపారు. ఆ పరిస్థితుల్లో విద్యార్థి తక్షణమే అమెరికాను వీడాల్సి ఉంటుందన్నారు. విద్యాసంస్థ నుంచి తొలగింపునకు గురైనవారికి గ్రేస్ పీరియడ్ కూడా ఉండదని చెప్పారు. అలాంటివారు 180 లేదా అంతకంటే ఎక్కువ రోజులు చట్టవిరుద్ధంగా అమెరికాలోనే ఉన్నట్లైతే.. తిరిగి వారు అమెరికాలోకి ప్రవేశించకుండా మూడేళ్ల నిషేధం విధిస్తారని తెలిపారు. చట్టవిరుద్ధంగా 12 నెలలకుపైబడి అమెరికాలో నివసించిన వారిపై ఈ నిషేధం పదేళ్ల వరకూ విధిస్తారని చెప్పారు. విద్యార్థితోపాటు ఎఫ్-2 హోదా ద్వారా అమెరికాలో నివసిస్తున్న విద్యార్థి జీవిత భాగస్వామి, పిల్లలపైనా ఈ తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. హింసాత్మక ఆందోళనల్లో అరెస్టయిన విద్యార్థుల వీసా రద్దయ్యే అవకాశం ఉందని, దీంతో వారు అమెరికాను వీడాల్సి ఉంటుందని తెలిపారు. 'వీసాతో వచ్చి అమెరికాలో నివసించేవారు ఆందోళనల్లో పాల్గొంటే గనుక, వారి వీసాల రెన్యువల్ సమయాల్లో సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. యూనివర్సిటీ గ్రాంట్స్ తద్వారా వారి స్కాలర్‌షిప్‌పైనా ప్రభావం పడే అవకాశం ఉంది' అని ఖైతాన్ అండ్ కో లీడర్‌షిప్ అండ్ రివార్డ్స్ డైరెక్టర్ ప్రితీశ్ గాంధీ తెలిపారు.

వైసీపీకి గుంటూరు డిప్యూటీ మేయర్ రాజీనామా

- నేడు టీడీపీలో చేరనున్న సజీల
- కార్పొరేటర్లపై అధికార పార్టీ నిఘా



టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసిన గుంటూరు డిప్యూటీ మేయర్ షేక్ సజీల

గుంటూరు, ఏప్రిల్ 30: సార్వత్రిక ఎన్నికలకు ముందు అధికార పార్టీ వైసీపీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. మొన్నటి వరకు ఆ పార్టీలో కీలకంగా వ్యవహరించిన పలువురు నేతలు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారు. ఇప్పటికే ఆరుగురు కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీలో చేరగా తాజాగా డిప్యూటీ మేయర్ షేక్ సజీల, ఆమె తండ్రి వైసీపీ నేత షేక్ షౌకత్‌లు ఆ పార్టీకి మంగళవారం రాజీనామా చేశారు. అనంతరం, వారిద్దరూ టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిశారు. టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో బుధవారం ఆ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. తూర్పు నియోజకవర్గంలో కీలక నేత, మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని ఇటీవల నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయన గత రెండు ఎన్నికల్లో వైసీపీ విజయం కోసం కృషి చేశారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే సుభానితో పాటు తనయుడు మాజీ డిప్యూటీ మేయర్ షేక్ గౌస్‌తో పాటు వైసీపీకి చెందిన ముగ్గురు కార్పొరేటర్లు ఖాజామొహిద్దీన్ చిష్టీ, షేక్ మీరావలి, వేముల జ్యోతిలు టీడీపీలో చేరారు. పశ్చిమ నియోజకవర్గంలో కూడా ముగ్గురు కార్పొరేటర్లు వైసీపీకి ఝలక్ ఇచ్చారు. ఇటీవల టీడీపీలో చేరిన మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీ వెంట వైసీపీ కార్పొరేటర్ శ్రీవల్లి కూడా వెళ్లారు. అనంతరం 23వ డివిజన్ కార్పొరేటర్ సాధు ఉమామహేశ్వరి, భర్త రాజేశ్, 19వ డివిజన్ కార్పొరేటర్ హనుమాయమ్మ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఇటీవల టీడీపీ యువనేత నారా లోకేశ్ సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల నుంచి మరికొంత మంది వైసీపీ కార్పొరేటర్‌లు తమకు టచ్‌లో ఉన్నారని, త్వరలోనే చేరేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నేతలు తెలిపారు. దీంతో కంగారు పడిన వైసీపీ.. కార్పొరేటర్‌లపై నిఘా పెట్టింది. ఏ కార్పొరేటర్లు పార్టీని వీడేలా ఉన్నారు? ఏం ఆశించి వెళుతున్నారు.. వంటి వివరాలు సేకరిస్తోంది. అదేసమయంలో కార్పొరేటర్ల కదలికలపై కీలక నేతలు ఆరా తీస్తున్నారు. కార్పొరేటర్ల కదలికలను గుర్తించేలా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు తెలిసింది.

'రెడ్‌బుక్' విచారణ 15కు వాయిదా

విజయవాడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రెడ్‌బుక్ పేరుతో అధికారులను బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ సీఐడీ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఏసీబీ కోర్టు మే 15వ తేదీకి వాయిదా వేసింది. లోకేశ్ తరఫున న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. ఇందుకు కొంత సమయం కావాలని న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ కోరగా, విచారణను న్యాయాధికారి మే 15వ తేదీకి వాయిదా వేశారు.

డీప్‌ఫేక్ వీడియో కేసు..

కాంగ్రెస్ ఎమ్మెల్యే పీఏ, ఆప్ నేత అరెస్టు

- రేవంత్‌కు సమన్లివ్వడం.. తెలంగాణ ప్రజలను అవమానించడమే
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్
- మన్మోహన్ ఫేక్ వీడియోలపై ఏం చేశారని ప్రశ్న
- నిజామాబాద్ పసుపుబోర్డు వాగ్దానం ప్రస్తావన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్ షా డీప్‌ఫేక్ వీడియో కేసులో ఓ ఎమ్మెల్యే పీఏ, మరో ఆప్ నేత అరెస్టయ్యారు. ఇప్పటికే ఈ కేసులో గువాహటికి చెందిన అసోం కాంగ్రెస్ ఎన్నికల వార్ రూమ్ సమన్వయకర్త సోమవారం రీతంసింగ్ అరెస్టవ్వగా.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సహా.. నలుగురు కాంగ్రెస్ నేతలకు ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. మంగళవారం మరో 12 మందికి నోటీసులు పంపారు. ఈ కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ పీఏ, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనుచరుడు సతీశ్‌వన్సోలాను, దావోద్ జిల్లా ఆప్ అధ్యక్షుడు ఆర్కే వారియాను అరెస్టు చేసినట్లు ఢిల్లీ సైబర్ సెల్ అధికారులు వెల్లడించారు. వీరిద్దరికీ వాట్సాప్ ద్వారా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా డీప్‌ఫేక్ వీడియో చేరిందని, వారు ఉద్దేశపూర్వకంగా ఆ వీడియను ఫేస్‌బుక్‌లో షేర్ చేశారని చెప్పారు. డీప్‌ఫేక్ వీడియోను ఎవరు ఎడిట్ చేశారనేదానిపై దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలో నిందితుడిని అరెస్టు చేస్తామని స్పష్టం చేశారు. తన పీఏ అరెస్టుపై ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ స్పందించారు. తన పీఏ పొరపాటున ఆ వీడియోలను షేర్ చేసి ఉంటారని అభిప్రాయపడ్డారు. ఆ వీడియో ఫేక్ అని అతనికి తెలిసి ఉండదన్నారు. బీజేపీనే చాలా కాలంగా ఫేక్ వీడియోలను వ్యాప్తి చేస్తోందని ఆరోపించారు. దానిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. డీప్‌ఫేక్ వీడియోను సృష్టించిన వారిని కాకుండా.. పొరపాటున షేర్ చేసిన వారిని అరెస్టు చేయడం సరికాదన్నారు.

రేవంత్ అంటే మోదీకి భయం: జైరాం రమేశ్

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అంటే ప్రధాని మోదీకి భయమని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. రేవంత్‌కు సమన్లు పంపడం అంటే.. తెలంగాణ ప్రజలను అవమానించడమేనని, ఇది నిష్పక్షపాతంగా జరగాల్సిన ఎన్నికలపై దాడేనని ఎక్స్‌లో ఆరోపించారు. "మాజీ ప్రధాని మన్మోహన్ డీప్‌ఫేక్ వీడియోలు బీజేపీ సృష్టించింది. ఆ వీడియోలను సర్క్యులేట్ చేస్తోంది. దీనిపై ఢిల్లీ పోలీసులు ఎందుకు మౌనంగా ఉన్నారు?" అని ప్రశ్నించారు. మొదటి రెండు దశల ఎన్నికల్లో బీజేపీ పేలవమైన ప్రదర్శనతో నిరాశకు లోనై.. బీజేపీ అవకాశాలను దెబ్బతీస్తున్న రేవంత్‌ను ప్రధాని మోదీ భయపెడుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని తిరస్కరించే రాష్ట్రాలను నిర్లక్ష్యం చేయడం మోదీకి అలవాటేనని విమర్శించారు. తెలంగాణ కూడా కేంద్రానికి చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు.. ఆ రాష్ట్రానికి 43 పైసలు మాత్రమే దక్కుతోందని గుర్తుచేశారు. పసుపు ఎగుమతుల్లో సుమారు 30% వాటాను తెలంగాణ అందిస్తోందని పేర్కొంటూ.. నిజామాబాద్ పసుపుబోర్డుపై మోదీ వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు.

బీజేపీకి 180 సీట్లు దాటవు: మాణిక్కం ఠాకూర్

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 180 సీట్లు దాటవని కాంగ్రెస్ నేత మాణిక్కం ఠాకూర్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. తెలంగాణలో మోదీ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని.. బీజేపీపై అసమ్మతి పెరగడం వల్లే మోదీ ఇలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మోదీ ఎన్ని కుట్రలు చేసినా.. తెలంగాణ ప్రజలు విశ్వసించరని స్పష్టం చేశారు.



విజయవాడలో సమావేశమైన హజ్ కమిటీ

హజ్ యాత్రకు సర్వం సిద్ధం చేయండి

- అధికారులకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ఆదేశం
- బెజవాడలో మొదటి సన్నద్ధత సమావేశం

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి హర్షవర్ధన్ అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని నిర్దేశించారు. 2024-హజ్ యాత్ర మొదటి సన్నద్ధత సమావేశాన్ని మంగళవారం విజయవాడలోని ముసాఫిర్ ఖానాలో నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ హజ్‌యాత్రకు ఈ ఏడాది కోటా 2,902 మందికిగాను ఇప్పటి వరకు 2,580 మంది నమోదు చేసుకున్నారన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 728 మంది, హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 1,118 మంది, బెంగళూరు ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 725 మంది, చెన్నై ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 9 మంది బయలుదేరనున్నారని పేర్కొన్నారు. మే 26 నుంచి జూన్ 9 మధ్య విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్‌యాత్రకు బయలుదేరానున్నారని తెలిపారు. హజ్‌యాత్రికులకు గన్నవరం సమీపంలోని మదరసాలో వసతి ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. మదరసా వద్ద టెంట్లు, ఎయిర్ కూలర్లు సిద్ధం చేయాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రత చర్యల్లో భాగంగా మహిళా పోలీసులను సైతం ఏర్పాటు చేయాలని సూచించారు. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా విమానాశ్రయ అధికారులు సహాయ, సహకారాలు అందిస్తారని తెలిపారు. యాత్రికులను మదరసా నుంచి గన్నవరం విమానాశ్రయానికి పంపించేందుకు ఆర్టీసీ చర్యలు చేపడుతుందన్నారు. మదరసా వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన వ్యాక్సినేషన్, వైద్య సహాయం అందించాలని వైద్యారోగ్యశాఖ అధికారులను కోరామన్నారు. హజ్‌యాత్రలో సుమారు 40 రోజుల పర్యటనకు మాత్రమే అనుమతి ఉందని, అంతకంటే ఎక్కువ రోజులకు అనుమతి లేదని తెలిపారు.

ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక జోక్యం చేసుకోలేం

- అభ్యంతరాలు ఉంటే ట్రైబ్యునల్‌ను ఆశ్రయించండి
- మాజీ మంత్రి నారాయణ నామినేషన్‌పై వ్యాజ్యం కొట్టివేత

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నెల్లూరు పట్టణ అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి మాజీ మంత్రి నారాయణ నామినేషన్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలైన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని గుర్తు చేసింది. రాజ్యాంగంలోని అధికరణ 329(బి) కోర్టుల జోక్యాన్ని నిరోధిస్తుందన్నారు. రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచిస్తూ.. పిటిషన్‌ను కొట్టివేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీకృష్ణమోహన్ తీర్పు ఇచ్చారు. నారాయణ తన నామినేషన్ పత్రాలలో భార్య వివరాలు ప్రస్తావించాల్సినచోట రెండో భార్య వివరాలను పొందుపర్చలేదని, తన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా నామినేషన్‌ను ఆమోదించారని పేర్కొంటూ నెల్లూరుకు చెందిన న్యాయవాది దేశాయ్‌శెట్టి హనుమంతురావు హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించారు. నిబంధనల ప్రకారం స్పౌజ్ కాలమ్‌లో భార్యకు సంబంధించిన అన్ని వివరాలను పొందుపర్చాలన్నారు. నారాయణ తన రెండో భార్య ఇందిర వివరాలను నామినేషన్ పత్రాలలో ప్రస్తావించలేదన్నారు. తమ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని, తగిన నిర్ణయాన్ని వెల్లడించేలా రిటర్నింగ్ అధికారిని ఆదేశించాలని కోరారు. నారాయణ తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై అభ్యంతరం ఉంటే ఎన్నికల ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాలి తప్ప రిట్ దాఖలు చేయడానికి వీల్లేదన్నారు. వ్యాజ్యానికి విచారణార్హత లేదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ... ఎన్నికల ప్రక్రియ మధ్యలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడానికి వీల్లేదన్నారు. ఈ వాదనలను పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి పిటిషన్‌ను కొట్టివేశారు.

కూటమి మేనిఫెస్టోపై ఉద్యోగుల్లో జోష్

- ప్రతి నెలా 1నే జీతాలు, పింఛన్లు హామీపై హర్షం


అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టోపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అధికార వైసీపీ, కూటమి మేనిఫెస్టోల్లో ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై ఆ వర్గాల్లో విస్తృతంగా చర్చ సాగుతోంది. వైసీపీ మేనిఫెస్టోలో ఏమీ లేదంటూ ఇప్పటికే ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. దానికంటే ఎన్డీయే కూటమి మేనిఫెస్టో బెటర్ అని అంతర్గత చర్చల్లో అంగీకరిస్తున్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు ఆశాజనకంగా ఉన్నాయని చెబుతున్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతినెలా 1వ తేదీనే జీతాలు, పెన్షన్లు ఇస్తామని చంద్రబాబు చెప్పడంతో.. గత ఐదేళ్లుగా జీతాలు, పింఛన్లు సకాలంలో అందక అనుభవించిన నరకయాతనను తల్చుకొని ఊపిరి పీల్చుకుంటున్నారు. వైసీపీ మేనిఫెస్టోలో ఉద్యోగులకు వచ్చే ఐదేళ్లలో ముఖ్యమైన హామీలేమీ ఇవ్వలేదని గుర్తుచేస్తున్నారు. జగన్ సర్కారు సకాలంలో వేతనాలు చెల్లించలేదని, డీఏలు ఇవ్వకుండా రూ.వేల కోట్లు బకాయి పెట్టిందని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా వైసీపీ మేనిఫెస్టోలో పెట్టిన అంశాలతో ఉద్యోగులకు ఒరిగేదేమీ లేదని స్పష్టం చేస్తున్నారు.

పీఆర్సీపై ఆశాభావం

ఉద్యోగులకు సకాలంలో పీఆర్సీ ఇస్తామని, అదేవిధంగా అధికారంలోకి రాగానే మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటిస్తామని చంద్రబాబు మేనిఫెస్టోలో స్పష్టంగా చెప్పారు. జగన్ సర్కారు ఉద్యోగులకు బకాయిపడిన రూ.25వేల కోట్లకుపైగా మొత్తాన్ని కొత్త ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలన్నీ చెల్లిస్తామని కూటమి మేనిఫెస్టోలో పేర్కొన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు దేశంలో మొట్టమొదటిసారిగా ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుటీ ఇచ్చింది చంద్రబాబేనని, ఇప్పుడు సీపీఎస్ అంశంలో ఒక మంచి నిర్ణయం తీసుకుంటాననే హామీ ఇచ్చారనే చర్చ జరుగుతోంది. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకూ ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తానని హామీ ఇవ్వడంపైనా ఉద్యోగుల్లో ఉత్సాహం నెలకొంది.

కాపులకు జగన్ మోసం!

- రాష్ట్ర కాపు జేఏసీ నాయకుల ధ్వజం



అనంతపురంలో మీడియాతో మాట్లాడుతున్న కాపు జేఏసీ నాయకులు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 30: జగన్ సర్కారు కాపులను దారుణంగా మోసం చేసిందని రాష్ట్ర కాపు సంఘాల జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో జేఏసీ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ, అరేటి ప్రకాశ్, రామ్మూర్తి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు కాపులను వెన్నుతట్టి ప్రోత్సహించారన్నారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన జగన్ కాపులను వెన్నుపోటుపొడిచారని మండిపడ్డారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్) కింద 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోవడంతో కాపు వర్గాల విద్యార్థులు నష్టపోయారన్నారు. కాపులకు ప్రత్యేకంగా ఏడాదికి రూ.2వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.10 వేలకోట్లు ఖర్చు పెడతామని గత ఎన్నికల ముందు హామీ ఇచ్చి, కేవలం రూ.1,490 కోట్లు ఖర్చుపెట్టారని విమర్శించారు. ఏ ఒక్కరికీ సబ్సిడీ రుణాలు ఇవ్వలేదన్నారు. టీడీపీ హయాంలో విదేశీ విద్యకు అర్హులైన పిల్లలకు దశలవారీగా రూ.15 లక్షలు చెల్లించారని, వైసీపీ పాలనలో అన్ని పథకాలనూ రద్దు చేశారని మండిపడ్డారు. కాపులంతా ఏకమై ఎన్డీయే కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.